‘క్యాపెక్స్ సపోర్ట్ స్కీమ్’తో రూ.10వేల కోట్ల పెట్టుబడులు



కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్: దేశంలో లిథియం, నికెల్ వంటి క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని మరింతగా పెంచేందుకు రూ.2,814 కోట్లతో కేంద్ర బొగ్గు, గనులశాఖ తీసుకురానున్న క్యాపెక్స్ సపోర్ట్ స్కీమ్‌కు క్యాబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పథకం వల్ల క్రిటికల్ మినరల్స్ దిగుమతుల భారం తగ్గుతుందని తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. “ఈ కొత్త పథకం ద్వారా రూ.10వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే మినరల్స్ విలువ ఏటా రూ.25,000 కోట్లు ఉండనుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. స్థానికంగా అనుబంధ రంగాలు అభివృద్ధి చెందుతాయి. అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ బ్యాటరీ ప్రోగ్రామ్, క్లీన్ ఎనర్జీ అండ్ బ్యాటరీ స్టోరేజ్ టార్గెట్స్, రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్ స్కీమ్, ఇండియా సెమీ కండక్టర్ మిషన్ వంటి - మిగతా 4లో...

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ సమీక్షలో మంత్రులు.

మంత్రి డి.శ్రీధర్ బాబుకు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ మను చౌదరి..

125 ఏళ్ల భూ సమస్యలకు తెరదించే..
సమగ్ర సర్వేకు శ్రీకారం..!



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..

-4లో

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి మంత్రి సమీక్ష సమావేశం..



మంత్రి పొంగులేటికి మొక్కను అందిస్తున్న కలెక్టర్ మను చౌదరి..

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..!
- రైతుల సమక్షంలోనే రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే..!వచ్చే ఏడాదిలోగా ప్రతి అంగుళం భూమికి సర్వే..!
- ఆధార్ తరహాలో భూమి రికార్డులు, భద్రతతో కూడిన పాస్‌బుక్కులు..!
- క్షేత్రస్థాయి సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం.. అధికారుల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ..
- వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమికి సమగ్ర సర్వే..
- రైతుల సమక్షంలోనే భూముల కొలతలు.. వివాదరహిత భూములే లక్ష్యం..
- భూ హద్దులు, స్వాధీన స్థితి, రెవెన్యూ--అటవీ సరిహద్దు వివాదాలకు పరిష్కారం..
- 22-ఏ జాబితాలో జీవోలు, మెమోల పరిధిలోకి రాని సమస్యలపైనా పరిశీలన..
- విధుల్లో నిర్లక్ష్యం, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే అధికారులపై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరిక..

ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వెలుగులు..



-5లో

- రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల ఇళ్లలో ఘనంగా పండుగ సంబరాలు..
- ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి.. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ దశల్లో..
- నాలుగు కార్పొరేషన్లలో జీ+5 విధానంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం..
- దీపావళి రోజున లబ్ధిదారుల ఇళ్ల వేడుకల్లో పాల్గొనాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మంత్రి పిలుపు..
- నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్ లలో జీం5 విధానంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం..
- రూ.40 వేలకోట్లతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని మంత్రి స్పష్టీకరణ..

రూ.325తో రోజంతా మెట్రో, ఆర్టీసీలో ప్రయాణం

- నెలవారీ ఉమ్మడి పాస్ రూ.4,000-4,500!
- మెట్రో-ఆర్టీసీ పాస్ ధరల తగ్గింపునకు నిర్ణయం
- దీపావళి నుంచి అమల్లోకి రానున్న కొత్త ధరలు



హైదరాబాద్ పెన్ పవర్: ‘క్యూర్’ ప్రాంతంలో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు ఊరట కలగనుంది. రెండు రవాణా వ్యవస్థల్లోనూ ప్రయాణించేందుకు ప్రవేశపెట్టిన ఉమ్మడి పాస్ ధరలను భారీగా తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా

-6లో



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో..

125 ఏళ్ల భూ సమస్యలకు తెరదించే..
సమగ్ర సర్వేకు శ్రీకారం..!


ఈటల రాజేందర్..
ఎంపి మల్కాజ్‌గిరి..

-మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి మంత్రి సమీక్ష సమావేశం..



మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 4:

రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రైతులకు తమ భూములపై సంపూర్ణ హక్కులు, భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి అంగుళం భూమిని సమగ్రంగా సర్వే చేసి, భూ యజమానులకు వివాదరహిత భూములు, పక్కా రికార్డులు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమం రైతుల సమక్షంలోనే జరగాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో భూమికి సంబంధించిన సమగ్ర, భద్రతతో కూడిన రికార్డులు, పాస్‌బుక్కులు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.. బుధవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి భూ సర్వే, రెవెన్యూ, స్టాంపులు--రిజిస్ట్రేషన్లు, హౌసింగ్ శాఖల పనితీరుపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సర్వే లక్ష్యాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు..

ప్రత్యేక అధికారుల ఎంపికతో చర్చలు..

భూ సర్వే అమలులో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని అనుసరిస్తోందని మంత్రి వెల్లడించారు. మండల స్థాయి అధికారుల జాబితా నుంచి కొందరిని ఎంపిక చేసి, ఆయా మండలాల్లో సర్వేకు సంబంధించిన అంశాలు, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల అభ్యంతరాలు, క్షేత్రస్థాయి ఇబ్బందులపై నేరుగా చర్చిస్తున్నట్లు వివరించారు. గతంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించామని, ప్రస్తుతం జిల్లాలకు నేరుగా వచ్చి స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందితో సమావేశమవుతున్నట్లు తెలిపారు. అధికారులు వాస్తవ పరిస్థితులను దాచిపెట్టకుండా ఉన్నది ఉన్నట్లుగా వివరించాలని సూచించారు.. ప్రజలు కోరుతున్న అంశాలు, పరిష్కారానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు, మార్గదర్శకాల్లో ఉన్న లోపాలు, అధికారులకు ఎదురవుతున్న ఇబ్బందులను స్పష్టంగా తెలియజేయాలన్నారు. సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు..

రైతుల సమక్షంలోనే సర్వే..
నిరంతరం అధికారుల పర్యవేక్షణ..!

సమగ్ర భూ సర్వే చేపట్టే గ్రామాల్లో రైతులు, భూ యజమానుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సర్వే జరుగుతున్న గ్రామాల్లో తహశీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అంతేకాకుండా ఉన్నతాధికారులు కనీసం వారంలో ఒకరోజైనా సర్వే జరుగుతున్న గ్రామాలను నేరుగా సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా, ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు..

నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తప్పవు..

ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని పొంగులేటి తెలిపారు.. అదే సమయంలో ఉద్దేశపూర్వకంగా సమస్యలను తప్పుదోవ పట్టించడం, ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పించడం, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడం వంటి చర్యలకు పాల్పడే అధికారులపై తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.. భూ సర్వే వంటి కీలక కార్యక్రమం విజయవంతం కావాలంటే వివిధ స్థాయిల అధికారులు సమిష్టి బాధ్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు..

125 ఏళ్ల తర్వాత మరో భారీ సమగ్ర సర్వే..!

దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో మరోసారి ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు.. మొదట చట్టంలో నిర్దేశించిన విధంగా ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడత సర్వేను వేగవంతంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.. ఈ సర్వే కేవలం భూముల కొలతలకే పరిమితం కాదని, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక అడుగు అవుతుందని వివరించారు.. ముఖ్యంగా రెవెన్యూ రికార్డుల్లో ఒకచోట ఉన్న సర్వే నంబర్లు, క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలను గుర్తించి సరిదిద్దేందుకు ఈ సర్వే దోహదపడుతుందని చెప్పారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూములకు సంబంధించిన సమస్యలు, భూముల హద్దులపై నెలకొన్న వివాదాలను కూడా సమగ్రంగా పరిశీలించి పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు..


మేడ్చల్ జిల్లా సమీక్షలో హాజరైన అధికారులు, ప్రముఖులు..

22-ఏ సమస్యలపైనా.. ప్రత్యేక దృష్టి..

భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లకు సంబంధించి కీలకంగా మారిన 22-ఏ జాబితాపైనా మంత్రి సమీక్షలో ప్రత్యేకంగా ప్రస్తావించారు.. ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోల పరిధిలోకి రాని అంశాలు ఇంకా ఏమైనా మిగిలి ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.. అలాంటి సమస్యలు ఉంటే వాటిని గుర్తించి, సంబంధిత నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో 22-ఏ జాబితాలో భూములు ఉన్న రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న సమగ్ర భూ సర్వేలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు సమన్వయంతో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘క్యాపెక్స్ సపోర్ట్ స్కీమ్’తో రూ.10వేల కోట్ల పెట్టుబడులు

-3 పేజి తరువాయి

కార్యక్రమాలకు అవసరమైన క్రూడ్ మినరల్స్‌ను అందించడంలో ఈ స్కీమ్ కీలక పాత్ర పోషిస్తుంది.

దిగుమతులు తగ్గించడమే లక్ష్యం

ప్రపంచ వ్యాప్తంగా లిథియం, నికెల్, కోబాల్ట్ వంటి క్రిటికల్ మినరల్స్‌కు భారీగా డిమాండ్ ఉంది. వీటి అవసరాల కోసం మనం దిగుమతులపై ఆధారపడుతున్నాం. దిగుమతులను తగ్గించేందుకు, క్రిటికల్ మినరల్స్ వ్యాల్యూ చైన్‌ను బలోపేతం చేసేందుకు కేంద్రం ప్రాధాన్యం ఇస్తోంది. ఇందుకోసం నేషనల్ క్రిటికల్ మిషన్‌ను అమలు చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశాల్లో తొలిసారిగా 4 క్రిటికల్ ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. 2017-18లో లిథియం దిగుమతుల కోసం రూ.6,500 కోట్లు ఖర్చు చేయగా, ప్రస్తుతం అది రూ.50,000 కోట్లకు పెరిగింది. ఈ ఖర్చును తగ్గించుకోవడానికి ప్రభుత్వ రంగ సంస్థ అయిన కేఏబీఐఎల్ (ఖనూాచీజీ× దీ×ణజుూఽ ×చీణ×ూా ూా×వీ×ుణ) ద్వారా అర్జెంటీనాలో 5 లిథియం మైనింగ్ బ్లాకులను కొనుగోలు చేశాం. ఇప్పటివరకు 9 కేంద్రాలను ఏర్పాటు చేశాం. దీని కింద ఇప్పటివరకు 58 కంపెనీల దరఖాస్తులకు ఆమోదం లభించింది. ఫలితంగా కొన్ని గనుల్లో కాడ్మియం, వెనేడియం ఉత్పత్తి ప్రారంభమైంది” అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు పొంగులేటి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు..

- రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల ఇళ్లలో ఘనంగా పండుగ సంబరాలు..
- ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి.. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ దశల్లో..
- నాలుగు కార్పొరేషన్లలో జీ+5 విధానంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం..
- దీపావళి రోజున లబ్ధిదారుల ఇళ్ల వేడుకల్లో పాల్గొనాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మంత్రి పిలుపు..
- నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్ లలో జీం5 విధానంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం..
- రూ.40 వేలకోట్లతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని మంత్రి స్పష్టీకరణ..

ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వెలుగులు..



రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 4:
రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లలో ఈ దీపావళి పండుగను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే గృహప్రవేశాలు పూర్తిచేసుకున్న 2,21,500 ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులతో కలిసి ప్రజాప్రతినిధులు, అధికారులు దీపావళి వేడుకల్లో పాల్గొనాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పేదల ఇళ్లలో వెలిగే ప్రతి దీపం వారి ఆత్మగౌరవానికి, సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థిక ఇబ్బందులు, అవరోధాలు ఎదురవుతున్నప్పటికీ పేదలకు భద్రత, భరోసాతో కూడిన సొంతింటిని అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు.. తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని వెల్లడించారు. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, వాటి నిర్మాణాలు కూడా పూర్తికానున్నాయని వివరించారు. గృహప్రవేశాలు జరిగిన ప్రతి ఇంటికి దీపావళి రోజున ప్రజాప్రతినిధులు,

జిల్లా కలెక్టర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వెళ్లి లబ్ధిదారుల కుటుంబాలతో పండుగ ఆనందాన్ని పంచుకోవాలని సూచించారు.. ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించే ఉద్దేశంతో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' పోస్టర్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు..

నాలుగు కార్పొరేషన్లలో ఇందిరమ్మ టవర్‌లు..!

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో మరో లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.. హైదరాబాద్‌లో చేపడుతున్న ఇందిరమ్మ టవర్ల తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్లలోనూ ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. జీం5 విధానంలో నిర్మించనున్న ఈ టవర్లకు సంబంధించి దీపావళిలోగా నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్లలో వచ్చే ఏడాది బోనాల పండుగను నిర్వహించే స్థాయికి నిర్మాణాలను తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు..

రూ.40 వేలకోట్లతో ఇళ్ల నిర్మాణం.. వెనక్కి తగ్గేది లేదు..!

రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.40 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేసే ప్రసక్తే లేదని పొంగులేటి స్పష్టం చేశారు. లబ్ధిదారులకు ఆర్థిక సహాయం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నామని, ప్రతి సోమవారం హైదరాబాద్ నుంచి పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా నిధులు విడుదల చేస్తున్నట్లు వివరించారు.నగరాలు, పట్టణాలు, గ్రామాలతో పాటు మారుమూల ప్రాంతాలు, తండాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు.. ప్రభుత్వ లక్ష్యం కేవలం ఇళ్లను మంజూరు చేయడమే కాకుండా, పేద కుటుంబాలకు శాశ్వత నివాస భద్రత కల్పించి వారి సొంతింటి కలను సాకారం చేయడమేనని మంత్రి పేర్కొన్నారు. ఈ దీపావళి వేడుకల ద్వారా లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ ఆనందాన్ని మరింత పెంచడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకానికి ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు..

కార్తీక వనభోజన మహోత్సవానికి ప్రముఖులకు ఆహ్వానం..!

-నవంబర్ 22న శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, నవంబర్ 4:
శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న కార్తీక వనభోజన మహోత్సవానికి పలువురు ప్రముఖులను సంఘ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలను అందజేస్తూ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, గాంధీభవన్ పీఆర్వో కప్పర హరిప్రసాద్‌రావులను సంఘ ప్రతినిధులు కలిసి ఆహ్వానించారు. అదేవిధంగా పలువురు ఇతర ప్రముఖులకు సైతం ఆహ్వాన పత్రికలు అందజేశారు.
కార్తీక మాస ఆధ్యాత్మిక విశిష్టతను చాటిచెప్పడంతో పాటు బ్రాహ్మణ కుటుంబాల మధ్య ఐకమత్యం, ఆత్మీయత, పరస్పర అనుబంధాలను బలోపేతం చేయడం ఈ వనభోజన మహోత్సవం ప్రధాన ఉద్దేశమని సంఘ ప్రతినిధులు తెలిపారు. సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలను భావితరాలకు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్, ప్రధాన సలహాదారు సర్వేపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులు గడ్డం రాంబాబు, పురోహితులు హరి రాఘవేంద్ర, సింహాచలం శ్రీధరాచార్యులు, శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.







అశోక్‌నగర్ డ్రైనేజీ కష్టాలకు త్వరలో చెక్!

కొత్త పైప్‌లైన్ పనులకు రంగం సిద్ధం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కౌకుట్ల రూపేందర్ రెడ్డి చొరవ

కాప్రా, పెన్ పవర్, నవంబరు 4: హెచ్‌బీ కాలనీ 19వ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్ కాలనీలో దీర్ఘకాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కౌకుట్ల రూపేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. కాలనీలో మురుగునీటి లీకేజీలతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

బుధవారం ఉదయం అశోక్‌నగర్ కాలనీ సభ్యులతో కలిసి బస్తీ దవాఖాన రోడ్డుతో పాటు పలు వీధుల్లో పర్యటించిన రూపేందర్ రెడ్డి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. డ్రైనేజీ సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ మేరకు నూతన డ్రైనేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ పది రోజుల క్రితం డీజీఎం వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేసినట్లు రూపేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెలలోనే కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

నసీబ్ చికెన్ షాప్ రోడ్డు నుంచి వాస్తవి మెడికల్ షాప్ వరకు, అశోక్‌నగర్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం రోడ్డు నుంచి బస్తీ దవాఖాన రోడ్డు వరకు, అశోక్‌నగర్ కమ్యూనిటీ హాల్ రోడ్డు, వేణు అన్న ఇంటి రోడ్డు ప్రాంతాల్లో నూతన



డ్రైనేజీ పైప్‌లైన్ల ఏర్పాటు పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కాలనీలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని కౌకుట్ల రూపేందర్ రెడ్డి తెలిపారు. ఈ పర్యటనలో కాలనీ సభ్యులు కనకయ్య, రాజు, శైలూ, అశోక్, నర్సింగరావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సాగు భూముల సంరక్షణకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి రామారావు



సాగు భూమి సంరక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

గార్ల, పెన్ పవర్, నవంబర్:4 సాగు భూముల సారవంతాన్ని కాపాడుతూ భూసార పరిరక్షణకు ప్రతి రైతు కృషి చేయాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు సూచించారు. బుధవారం గార్ల మండల పరిధిలోని పోచారం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూతీ బచావో అభియాన్ సాగు భూమి సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు భూసార పరిరక్షణ, పంటల సాగు విధానాలు, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు.అనంతరం ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కావటి రామారావు మాట్లాడుతూ విచక్షణారహితంగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని తెలిపారు. రసాయనఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ, జీవ ఎరువులను వినియోగించడం ద్వారా నేల భౌతిక స్థితి మెరుగుపడటంతోపాటు నీటి నిల్వ సామర్థ్యం, నేలలో కార్బన్ శాతం పెరుగుతాయని వివరించారు. ప్రతి ఏడాది ఒకే రకమైన పంట సాగు చేయకుండా పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు. వరి, పత్తి, మొక్కజొన్న బదులుగా చిరుధాన్యాలు, పప్పుదినుసులు, కూరగాయల సాగుపై దృష్టి సారిస్తే తక్కువ నీటి వినియోగంతో తక్కువ కాలంలో మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు.ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగు ప్రణాళికరూపొందించుకోవాలని, ప్రస్తుత పంటల్లో సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించి తగిన సూక్ష్మపోషకాలను వినియోగించాలని తెలిపారు. మిరప పంటలో వైరస్, కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వైరస్ నివారణకు వేపనూనె వినియోగించాలని,

కాండం కుళ్లు తెగులు నివారణకు ట్రైకోడెర్మా లేదా కోసైడ్, కాపర్ ఆక్సీక్లోరైడ్ మందులను మొక్క మొదళ్ల వద్ద డ్రెంచింగ్ చేయాలని వివరించారు.వ్యవసాయ సంబంధిత సాంకేతిక సలహాలు, సూచనల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి పూజిత, పశువైద్యాధికారి సురేష్, ఇరిగేషన్ ఏఈ భరత్, గ్రామ సర్పంచ్ రమ్య, ఉప సర్పంచ్, భయ్యా సురేష్ పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో ఏదులాపురం ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవతో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు

28వ వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి

మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి

ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 4 మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా ఏదులాపురంలో అభివృద్ధి పనులకు కొత్త ఊపునిస్తున్నామని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

వార్డు సమస్యలపై వినతి అభివృద్ధికి హామీ

ఏదులాపురం మున్సిపాలిటీ 28వ వార్డుకు చెందిన సీపీఐ మాజీ వార్డు సభ్యుడు నారపొంగు యాకూబ్, ఆయన



సోదరుడు మల్సూర్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో బుధవారం తుంబూరు దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తమ వార్డులో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ప్రజల రాకపోకలకు అనువుగా సీసీ రోడ్లు, మురుగునీటి సమస్య పరిష్కారానికి సైడ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని కోరారు.వారి విజ్ఞప్తిని పరిశీలించిన దయాకర్ రెడ్డి, సంబంధిత సమస్యలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాణోతు కిషోర్ నాయక్, ఉపాధ్యక్షుడు వెంపటి సురేష్, 7వ వార్డు కౌన్సిలర్ బుర్రా మహేష్, 28వ వార్డు అధ్యక్షుడు నూకల రాంమోహన్ రెడ్డి, నాయకులు శివలింగం, ఏపూరి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవళిక మృతి పట్ల మంత్రి పొంగులేటి తీవ్ర దిగ్భ్రాంతి



బాధిత కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది

ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 4: మణుగూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవళిక మృతి తీవ్ర విషాదాన్ని నింపిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆమె మృతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రవళిక మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా ఉద్యోగికి ఎదురైన ఈ విషాద ఘటన బాధాకరమని పేర్కొన్నారు.ప్రవళిక కుటుంబాన్ని ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, వారికి అండగా నిలుస్తుందని మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రూ.325తో రోజంతా మెట్రో, ఆర్టీసీలో ప్రయాణం

-3 పేజి తరువాయి

రోజువారీ పాస్‌ను రూ.325కు, నెలవారీ పాస్‌ను రూ.4,000 లేదా రూ.4,500కు అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఈ మేరకు మెట్రో రైలు, ఆర్టీసీ యాజమాన్యాల మధ్య కీలక చర్చలు జరిగి ఓ అవగాహనకు వచ్చారు. నేడో..రేపో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్‌జాజుతో ఆర్టీసీ ఎండీ, మెట్రో రైలు సలహాదారు సమావేశం కానున్నట్లు సమాచారం. ఈ భేటీతో పాస్ ధరలపై పూర్తి స్పష్టత, అధికారిక ప్రకటన రానున్నట్లు ఆర్టీసీ వర్గాల సమాచారం. తగ్గించనున్న ఉమ్మడి పాస్ ధరల్ని దీపావళి నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు తెలిసింది.

నెలవారీ పాస్ ధర... సగానికి తగ్గింపు

ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో మెట్రో రైళ్లతోపాటు ఆర్టీసీ బస్సుల్లోనూ ప్రయాణం నిమిత్తం ఉమ్మడిపాస్‌ను ప్రవేశపెట్టారు. అయితే నిర్ణయించిన ధరలు అధికంగా ఉండటంతో ప్రయాణికుల నుంచి ఆశించిన స్పందన లభించలేదు. ముఖ్యంగా నెలవారీ పాస్ ధర రూ.8,500గా నిర్ణయించడం ప్రతికూల ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో ధరలు తగ్గించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మెట్రోరైలు సలహాదారు ఎన్వీఎస్‌రెడ్డితో చర్చించారు. ఆ ధరను రూ.4,000 లేదా రూ.4,500కు పరిమితం చేయాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఇందులో ఆర్టీసీకి రూ.1,000, మిగిలిన రూ.3,000 లేదా రూ.3,500 మెట్రోకు కేటాయించేలా చర్చలు జరిగినట్లు తెలిసింది. రోజువారీ పాస్ ప్రస్తుతం రూ.400. దాన్ని రూ.325కు అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఈ పాస్‌లో ఆర్టీసీకి రూ.75, మెట్రోకు రూ.250 చొప్పున కేటాయించనున్నట్లు తెలిసింది.

కరువు మండలంగా ప్రకటించి,సహాయక చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గార్ల, పెన్ పవర్, నవంబర్:4 గార్ల మండలాన్ని కరువ మండలంగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు వంగూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.స్థానిక మంగపతిరావు భవనంలో కుంట రామకృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగిన వ్య,కా,స మండల కమిటీ సమావేశంలో అయన మాట్లాడుతూ విబి జీ రాంజీ పథకం ద్వారా పనులు చేపట్టడంతో పాటు పని దినాలు పెంచి,కనీస వేతనాలు అమలు చేయాలని,కరువు పెన్షన్ రైతులకు, కూలీలకు నెలకు 10వేల రూ,లు చొప్పున 6 నెలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురువక పంటలు దెబ్బతిని రైతులు అప్పుల ఊబిలో కురుకుపోయారని దీంతో మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుత పరిస్థితుల రీత్యా తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని దీనిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని, పంచాయతీలకు ప్రత్యేక కరువు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో వ్య. కా. స మండల గౌరవ అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్, జిల్లా నాయకులు బి రాజ్యలక్ష్మి,ఇమ్మడి లచ్చయ్య,పి. వెంకన్న, సందీప్, జె. శ్రీను, టీ. ధనమ్మ,టీ. జ్యోతి, బి. పద్మ, తదితరులు ఉన్నారు

కోమటిరెడ్డికి మంత్రి పదవి దూరమయినట్లేనా?

హైదరాబాద్ పెన్ పవర్: కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి ఇంకా ఊరిస్తూనే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తుంది. అయితే ఇప్పటి వరకూ రెండు, మూడు సార్లు మంత్రి వర్గ విస్తరణజరిగినప్పటికీ కోమటిరెడ్డికి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని మాత్రం కాంగ్రెస్ హైకమాండ్ నెరవేర్చలేదు. దీంతో ఆయనలో ఉన్న అసంతృప్తి అప్పుడప్పుడూ బయటకు వస్తుంది. తాజాగా తననియోజకవర్గం అభివృద్ధి నిధులు మంజూరు చేయకుండా పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఫ్రస్టేషన్ అంతా మంత్రి పదవి దక్కకపోవడమే ప్రధాన కారణంగా కనపడుతుంది. ఇంకా

తెలంగాన మంత్రి వర్గంలో ఖాళీలున్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో మాత్రం నాన్చుడు ధోరణిని వ్యవహరిస్తుండటాన్ని ఆయన సన్నిహితుల వద్ద ప్రస్తావిస్తున్నట్లు సమాచారం.కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి

మంత్రి పదవి దూరం కాలేదని, సమయం వచ్చినప్పుడు న్యాయం జరుగుతుందని పార్టీ అధిష్టానం హామీ ఇచ్చిందని ఆయన గతంలో తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్నిరోజులైనా తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.తాజాగా గట్టుప్పల్ మండలంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పదవి ఇస్తామని మోసం చేశారని,నిధులు కూడా రావడం లేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తే ఎక్కడికో వెళ్లిపోతాననే ఉద్దేశంతోనే ఇవ్వడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండామునుగోడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే పదవులను పట్టుకుని వేలాడబోనని, అవసరమైతే ఎమ్మెల్యే పదవిని వదులుకోవడానికి కూడా వెనుకాడనని హెచ్చరించారు. మంత్రిపదవి మరియు నిధుల విషయంలో ఆయన చేస్తున్న ఈ సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవిదక్కకపోవడానికి అనేక కారణాలున్నాయి. సామాజికవర్గంతో పాటు ప్రధానంగా నల్లగొండ జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉండటం, అందులో ఆయన సోదరుడు వెంకటరెడ్డి ఉండటం కూడా మంత్రిపదవి దక్కకపోవడానికి ప్రధాన కారణమని చెబుతున్నారు. సమయం మించి పోతుందని, ఇప్పటి వరకూ హైకమాండ్ తనకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం లేదని ఆయన అన్న మాటల్లో అసంతృప్తితోపాటు ఆవేదన కూడా ఉంది. అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చెప్పడం కూడా హెచ్చరిక కిందనే చూడాల్సి ఉంటుంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో హైకమాండ్ స్పందించకపోతేకాంగ్రెస్ పార్టీకి త్వరలోనే గుణపాఠం చెబుతామని ఆయన అనుచరులు సోషల్ మీడియాలో హెచ్చరిస్తున్నారు

మంచుకొండ వద్ద ప్రమాదాల నివారణకు

పోలీసుల ముందస్తు చర్యలు

రేడియం స్టిక్కర్లతో కూడిన బారికేడ్ల ఏర్పాటు

వాహనదారుల భద్రతే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు



ఖమ్మం, పెన్ పవర్: నవంబర్ 4 ఖమ్మం నుంచి ఇల్లెందు వెళ్లే ప్రధాన రహదారిలోని మంచుకొండ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రఘునాథపాలెం ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ కరుణాకర్ గారు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాన్ని గుర్తించి, వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రేడియం స్టిక్కర్లు అమర్చిన బారికేడ్లను ఏర్పాటు చేయించారు.రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులకు రహదారిపై ప్రమాదకర ప్రాంతాలు స్పష్టంగా కనిపించేలా ఈ చర్యలు చేపట్టారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అతివేగాన్ని నియంత్రించుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు.


మీ భద్రత మీ చేతుల్లోనే. ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా ఇంటికి చేరండి" అని ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

కండక్టర్ ప్రవళిక మృతికి నిరసనగా

ఖమ్మం ఆర్టీసీ సిబ్బంది ర్యాలీ

ఖమ్మం డిపో బస్సుల సిబ్బంది ఆవేదన

ఉద్యోగుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి చెందిన విషయం తెలుసుకొని నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది



ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి చెందిన విషయం తెలుసుకొని ఖమ్మం డిపో బస్సులు తాత్కాలికంగా నిలిపివేశారు

ఖమ్మం, పెన్ పవర్, నవంబర్ 4 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సమీపంలో ఆర్టీసీ బస్సులో జరిగిన వివాదంలో కిందపడిన మహిళా కండక్టర్ ప్రవళిక చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఖమ్మం ఆర్టీసీ డిపో సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనకు నిరసనగా ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.తోటి ఉద్యోగిని కోల్పోవడంతో సిబ్బంది తీవ్ర ఆవేదనకు గురయ్యారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఉద్యోగులకు తగిన భద్రత కల్పించాలని, ప్రవళిక మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రాణాలకు భద్రత కల్పించాలి అంటూ నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్ నివారణ

గార్ల, పెన్ పవర్, నవంబర్ :4 సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ దోహదం చేస్తుందని డాక్టర్ హనుమంతరావు అన్నారు.ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం గార్ల మండల కేంద్రంలోని గౌట్ గర్ల్స్ హై స్కూల్ 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల 4 గురు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ టీకాలు అందజేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ హనుమంతరావు, వ్యాక్సిన్ ప్రాధాన్యంపై విద్యార్థినులు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి మాట్లాడారు



విద్యార్థులకు వ్యాక్సిన్ అందజేస్తున్న వైద్య సిబ్బంది

బాలకల ఆరోగ్య రక్షణలో భాగంగా హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) టీకా ఎంతో ముఖ్యమైనదని వైరస్ వల్ల కలిగే ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ సమర్థవంతంగా పనిచేస్తుందని, ముఖ్యంగా భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ వచ్చే అవకాశాలను గణనీయంగా తగ్గిస్తుందని వివరించారు. చిన్న వయస్సులోనే ఈ టీకా తీసుకోవడం ద్వారా మెరుగైన రోగనిరోధక శక్తి ఏర్పడుతుందని తెలిపారు.హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై తల్లిదండ్రులు ఎలాంటి అపోహలు, భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ఇది సురక్షితమైన టీకా అని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి బాలికకు ఈ వ్యాక్సిన్ వేయించి వారి ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని తల్లిదండ్రులను కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అర్హులైన బాలికలందరికీ దశలవారీగా హెచ్‌పీవీ టీకాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ప్రమీల ఏఎన్ఎం స్వప్న ఆశ కార్యకర్త రమణమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ఉపాధ్యాయులు విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి కబ్జాలపై మళ్లీ హైడ్రా -- లెక్కుందా?

హైదరాబాద్, నవంబర్ 4, పెన్ పవర్:

హైదరాబాద్‌లోని చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పడిన హైడ్రా బీఆర్ఎస్ మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కుటుంబ సభ్యులపై మరోసారి విరుచుకుపడింది. మేడ్చల్–మల్కాజిగిరిజిల్లా జీడిమెట్ల పరిధిలోని ప్రసిద్ధ ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ , బఫర్ జోన్‌లను ఆక్రమించి నిర్మించిన గోడలను కూలగొట్టారు. మల్లారెడ్డి కుటుంబీకుల ఫామ్‌హౌస్ కాంపౌండ్ వాల్, ప్రవేశ ద్వారాలను హైడ్రాఅధికారులు బుల్డోజర్లతో పూర్తిగా కూల్చివేశారుఫాక్స్ సాగర్ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించిన అధికారుల బృందం విస్తుపోయే నిజాలను బయటపెట్టింది.చెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో దాదాపు 15 ఎకరాల మేర మట్టిని అక్రమంగా నింపి, ఎత్తు పెంచి అర కిలోమీటరు మేర భారీ కట్ట నిర్మించుకున్నట్లు తేలింది. ఈ కట్టను ఆనుకుని ఫామ్‌హౌస్‌కు రక్షణగా ఎత్తైనకాంపౌండ్ వాల్, ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. భారీ పోలీసు భద్రత నడుమ రంగంలోకి దిగిన అధికారులు ఈ అక్రమ కట్టడాలను నిమిషాల వ్యవధిలో ధ్వంసం చేశారు.కూల్చివేతల సమయంలోమల్లారెడ్డి అనుచరులు, స్థానిక ప్రతినిధులు కొంతమంది అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, హైడ్రా యంత్రాంగం వెనక్కి తగ్గలేదు. ప్రభుత్వం జారీ చేసిన శాటిలైట్ మ్యాప్‌లు, ఒరిజినల్ రెవెన్యూ రికార్డులనుక్షేత్రస్థాయిలో చూపించి,చట్టప్రకారమే ముందుకు



వెళ్తున్నామని స్పష్టం చేశారు. ఎంతటి రాజకీయ హోదా ఉన్నవారైనా, మాజీ మంత్రులైనా సరే చెరువులను కబ్జా చేసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తేఉపేక్షించే ప్రసక్తే లేదని అధికారులు తేల్చిచెప్పారు.ఫాక్స్ సాగర్‌కు ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని పునరుద్ధరించి, చెరువు పరివాహక ప్రాంతాన్ని ఆక్రమణదారుల నుంచి విముక్తి చేసే వరకు ఈ ప్రక్షాళన డ్రైవ్ కొనసాగుతుందని

హైడ్రా అధికారులు ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో మల్లారెడ్డికి చెందిన చాలా ఆస్తుల విషయంలో వివాదాలు వచ్చాయి. కొన్నింటినీ కూల్చివేశారు. అయితే తర్వాత వెనక్కితగ్గారు. మళ్లీ ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు తీస్తున్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లపై కర్చీఫ్‌లు

హైదరాబాద్, నవంబర్ 4, పెన్ పవర్:

తెలంగాణలో మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. ఈ సారి గవర్నర్ కోటాలో ఉన్న మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. దీంతో మాకంటే మాకే అంటూ.. చాలా మంది నాయకులు క్యూ కట్టారు.అయితే.. రెండు రకాలుగా ఈ విషయంపై పార్టీ నేతలు దృష్టి పెట్టారు. 1) పార్టీ కోసం కష్టపడిన నాయకులు. 2) సామాజిక వర్గాల వారీగా నాయకుల ఎంపిక. ఈ రెండు అంశాలపైనా నాయకులు తర్జన భర్జన పడుతున్నారు. ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని గత కొన్నాళ్లుగా డిమాండ్లు తెరమీదికి వచ్చాయి. అయితే.. మంత్రి వర్గంలో ఒకరిద్దరికి అవకాశాలుకల్పించారు. అయినప్పటికీ.. మెజారిటీ పరంగా తమ కు న్యాయం జరగడం లేదని ఆయా వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాల్లో తమకు అవకాశంఇవ్వాల్సిందేనని భీష్మిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం -ఓట్ చోరీ- వ్యవహారంపై పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టడంతో ఈ అంశంపై ఇంకా దృష్టి పెట్టలేదు. ఇక, సీట్లను ఆశిస్తున్న వారిలో చాలా మంది కాంగ్రెస్ సీనియర్లే ఉండడం గమనార్హం. దాదాపు పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన నేతలు, ముఖ్యంగా రేవంత్ రెడ్డి తరఫున పార్టీలోకి వచ్చిన వారు కూడా ఇప్పుడు ఈ పదవులపై ఆశలుపెట్టుకున్నారు. ఈ వ్యవహారం రాను రాను మరింత తీవ్రమవుతోంది. ఈ క్రమంలో మూడు సీట్లలో ఎస్సీ మాదిగలకు ఒకటి కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దొమ్మేటి సాంబయ్యముందు వరుసలో నిలిచారు. అయితే..డిప్యూటీ సీఎం అనుచరుడిగా పేరున్న ప్రీతమ్ కూడా ఈ జాబితాలోనే ఉండడం గమనార్హం. అలాగే.. కొందరు

మాజీ ఎమ్మెల్యేలు కూడా ఎమ్మెల్సీ రేసులో ఉన్నారు. సంపత్ కుమార్, చారుకొండ వెంకటేష్ తదితరులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మరోవైపు ఒక్కసీటు కూడా తమకు కేటాయించరా? అంటూ.. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వేణుగోపాల్‌కూడా తెరమీదికి వచ్చారు. అలానే.. ఇతర నాయకులు కూడా పట్టు బడుతున్నారు. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికర చర్చకు దారితీసింది. బీసీ కోటాలో అనిల్, కైలాష్, జగదీశ్వర్, జక్కని అనితలు సై అంటున్నారు. మొత్తంగా ఉన్న మూడు స్థానాలకు దాదాపు 30 మందికి పైగా నాయకులు తలపడుతుండడం గమనార్హం

రేవంత్ పవర్ కనిపించిందా....

హైదరాబాద్, నవంబర్ 4, పెన్ పవర్:

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం వేదికగా 'ఇండియా' కూటమి నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ర్యాలీ జాతీయ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపింది. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూచేపట్టిన ఈ మహా ప్రదర్శనలో తెలంగాణ కాంగ్రెస్ ప్రదర్శన అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా సుదూర ప్రాంతమైన తెలంగాణ నుంచి వేల సంఖ్యలో శ్రేణులను ఢిల్లీకి తరలించడం వెనుక సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం స్పష్టంగా కనిపించింది. ఈ ఈవెంట్ కేవలం ఒక నిరసన సభగా మాత్రమే కాకుండా, జాతీయ స్థాయిలో రేవంత్ రెడ్డి రాజకీయ సత్తాను నిరూపించే వేదికగా మారింది.ఢిల్లీకి పెద్ద ఎత్తునవెళ్లేందుకు తెలంగాణ కాంగ్రెస్ సిద్ధమైంది. అయితే చివరి నిమిషంలో రైళ్లను కేటాయించేందుకు కేంద్రం నిరాకరించడం లాంటి పరిణామాలు కాంగ్రెస్ శ్రేణులను నిరుత్సాహపరిచాయి. అయితే, సీఎం రేవంత్ రెడ్డిఈ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ బి. మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ఈ మొత్తం ప్రణాళికను స్వయంగాపర్యవేక్షించారు. వందలాది స్లీపర్ బస్సులు, ప్రైవేటు వాహనాలు, విమానాల ద్వారా దాదాపు 8,000 మందికి పైగా కేడర్‌ను ఢిల్లీకి చేర్చి, తెలంగాణ కాంగ్రెస్ పవర్ ఏంటో నిరూపించారు. వేదికపై ప్రధానిమోదీ, ఎన్నికల సంఘం తీరుపై రేవంత్ సంధించిన అస్త్రాలు కాంగ్రెస్ హైకమాండ్ ను ఎంతగానో ఆకట్టుకున్నాయి.భారీ జన సమీకరణతో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖార్గే, రాహుల్ గాంధీ, సోనియాగాంధీల వద్ద రేవంత్ రెడ్డి ఇమేజ్ మరోసారి బలపడింది. పొరుగు



రాష్ట్రాలతో పోలిస్తే, ఇంత దూర ప్రాంతం నుంచి ఇంత పెద్ద ఎత్తున కేడర్ ను తరలించడం ఆయన సత్తాకు నిదర్శనంగా నిలిచింది. ఇప్పటికేఏఐసీసీ నిధుల సమీకరణలో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన, ఈ సభ ద్వారా 'సౌతిండియన్ స్టార్ లీడర్'గా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నారు. పార్టీ కష్టకాలంలో వెన్నంటి నిలిచిన రేవంత్‌పైరాహుల్ గాంధీకి ఉన్న నమ్మకం ఈ విజయంతో మరింత రెట్టింపైంది.జాతీయ స్థాయిలో రేవంత్ రెడ్డి ప్రాభవం పెరగడం రాష్ట్ర రాజకీయాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపనుంది. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్‌పదవుల కేటాయింపు, స్థానిక సంస్థల ఎన్నికల బి ఫారాల జారీ వంటి కీలక విషయాలలో ఇకపై ఆయనదే తుది నిర్ణయం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. హైకమాండ్‌లో తిరుగులేని పట్టుసాధించడం ద్వారా సొంత పార్టీలోని అసమ్మతి వర్గాలకు, ప్రతిపక్షాలకు ఆయన గట్టి సందేశం పంపినట్లయింది. రేవంత్ వ్యతిరేకులు ఇకపై ఆయనను రాజకీయంగా ఎదుర్కొనేందుకు తీవ్రంగా శ్రమించాల్సిఉంటుంది.

ఏఐతో మోసాల్లో రియల్

హైదరాబాద్, నవంబర్ 4, పెన్ పవర్:

ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావం సామాన్యుల జీవితాలపై ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ప్రముఖ యూట్యూబ్ ఛానెళ్లు చెప్పేమాటలను ప్రజలు గుడ్డిగా నమ్మేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు కేటుగాళ్లు రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త మోసాలకు తెరలేపారు. ఎలాంటి మౌలిక వసతులు, చట్టపరమైన లీగల్‌క్లియరెన్సులు లేని బోగస్ వెంచర్లను కూడా సోషల్ మీడియా వేదికగా బ్రహ్మాండమైన ప్రాజెక్ట్‌లుగా అభివర్ణిస్తూ అమాయకులను పెద్ద ఎత్తున మోసగిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.ఈ మోసాలవెనుక పెద్ద తంతే నడుస్తోంది. మార్కెట్లో ఎలాంటి గుర్తింపు లేని లేదా వివాదాస్పదంగా ఉన్న వెంచర్ల యజమానులు సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ ఉన్న ఇన్‌ఫ్లుయెన్సర్లను భారీ మొత్తంలోదబ్బులిచ్చి ప్రచారం చేయించుకుంటున్నారు. ఆయా ఛానెళ్ల హోస్ట్‌లు తాము స్వయంగా ఆ ప్రాజెక్ట్‌ను పరిశీలించినట్లు, భవిష్యత్తులో కోట్లలో లాభాలు వస్తాయని అతిశయోక్తులతో కూడిన ప్రమోషనల్

వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో వదులుతారు. ఆ మాయ మాటలను నమ్మి సామాన్యులు, ఎన్ఆర్ఐలు తమ కష్టపడిన సంపాదనను ఆ వెంచర్లలో గుడ్డిగా పెట్టుబడి పెట్టి నిలువునామోసపోతున్నారు.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆ వెంచర్లకు హెచ్ఎండీఏ లేదా జీడీఏ అనుమతులు ఉండవు సరికదా, కనీసం కరెంటు, రోడ్లు, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు కూడా ఉండవు.కొన్నిసార్లు భూములు ప్రభుత్వ లేదా అసైన్డ్ భూముల వివాదాల్లో ఉంటాయి. అయినప్పటికీ ఇన్‌ఫ్లుయెన్సర్లు సృష్టించే కృత్రిమ హైప్ కారణంగా కొనుగోలుదారులు అసలు నిజాలు తెలుసుకోలేకపోతున్నారు.రిజిస్ట్రేషన్ సమయంలో అసలు విషయం బయటపడేసరికి బాధితులు లబోదిబోమంటూ లాయర్లు, పోలీసులను ఆశ్రయించాల్సిన దుస్థితి తలెత్తుతోంది.అందువల్ల సోషల్ మీడియాలో వచ్చే అందమైన

ప్రకటనలు, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రమోషన్లను చూసి ఏమాత్రం ఆకర్షితులు కావద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏదైనా రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లో పెట్టుబడి పెట్టే ముందు లేదా ప్లాట్లు కొనే ముందు.. ఆ సంస్థకురెరా రిజిస్ట్రేషన్ ఉందా లేదా?, సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు వచ్చాయా లేదా అని స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించుకోవడం అత్యంత కీలకమని స్పష్టం చేస్తున్నారు.

ఎలా గెలవాలో చెప్పారు...జగన్ కంగ్రాట్స్ !



ఏపీలో చంద్రబాబు జగన్ ల మధ్య ఉన్నది కేవలం రాజకీయ వైరం అని ఎవరూ అనుకోరు. అది వ్యక్తిగత స్థాయిలో కూడా ఉందని భావించే వారూ నమ్మే వారూ ఉన్నారు. దానికి ఉదాహరణలు కూడా ఉన్నాయని చెబుతారు. ఈ ఇద్దరూ ఎక్కడా నేరుగా కలసిన సందర్భాలు లేవు, ఎవరు సీఎం గా ఉన్నా రెండవవారు ముఖం చాటేసే వైఖరినే ప్రదర్శిస్తూ వచ్చారు. అయితే సోషల్ మీడియా ద్వారా ఒకరి పుట్టిన రోజుకు మరొకరు శు భాకాంక్షలు మాత్రం చెప్పుకుంటారు. అంతవరకే అది. అలాంటిది నేరుగా చంద్రబాబుకు జగన్ కంగ్రాట్స్ చెబుతూ ట్వీట్ చేశారు అంటే అందులో చాలానే మ్యాటర్ ఉండాలిగా. అందుకే అంతా దాని గురించే విశ్లేషిస్తున్నారు.

జగన్ ఏమన్నారంటే :

కంగ్రాట్స్ చంద్రబాబు గారూ అంటూ ఏపీలో అర్బన్ బాడీస్ ఎన్నికల్లో సక్సెస్ తరువాత జగన్ ట్వీట్ చేశారు. ఇది అందరినీ ఆకట్టుకుంది. బాబు గెలుపుకి ఆయన అసలైన రాజకీయ ప్రత్యర్థి జగన్ ఎలా కంగ్రాట్స్ చెబుతారు అని అని ఆలోచించేవారే ఎక్కువ. మరి ఆ కంగ్రాట్స్ వెనకనే ఎన్నో సెటైర్లు ఎన్నో కామెంట్స్ దట్టించి మరీ జగన్ వదిలారు. అదే ఇపుడు రాజకీయంగా వైరల్ అవుతోంది. చంద్రబాబుని ని ఒక టీం గా జగన్ చేశారు. ఆ టీం లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉంది, అలాగే పోలీసు యంత్రాంగం ఉంది. అలా టీం చంద్రబాబుకు జగన్ కంగ్రాట్స్ చెప్పారన్న మాట. ఇది సెటైరికల్ గా గట్టిగా గుచ్చుకోవాలని అలాగే చర్చ సాగాలనే జగన్ ఈ ట్వీట్ వేశారు అని అంటున్నారు.


చాన్స్ ఇవ్వలేదు :

అంతే కాదు ఎన్నికల్లో ఎలా గెలవాలో అన్నది బాబు అండ్ టీం క్లారిటీగా తెలియచెప్పింది అని జగన్ కామెంట్స్ చేశారు. అందులోనూ ప్రతిపక్షానికి పోటీ చేసేందుకు కనీసం అవకాశం ఇవ్వకుండా ఎలా చేయవచ్చూ ప్రతీ దశలోనూ చూపించారు అని కూడా కామెంట్స్ చేశారు. నామినేషన్ల దాఖలు దశ నుంచి హైజాక్ చేస్తూ వచ్చారని, స్క్రూటినీ, విత్ డ్రాయల్, పోలింగ్ ఏజెంట్లను బయటకు పంపించడం, రిగ్గింగ్ చేసుకోవడం, పోల్ పర్సెంటేజ్ ని కూడా మానేజ్ చేయడం, కౌంటింగ్ హైజాక్ చేయడం ఇవన్నీ కూడా గెలుపు ఎలా సాధించాలో చేసి చూపించారని జగన్ తన కంగ్రాట్స్ మెసేజ్ లోనే హాట్ కామెంట్స్ గా చెప్పుకొచ్చారు అన్న మాట.

ఎలక్షన్ కానే కాదు :

అందువల్ల అర్బన్ బాడీస్ కి జరిగినవి ఎన్నికలు కానే కాదని సెలెక్షన్ మాత్రమే అని జగన్ తేల్చేశారు. ప్రజలు ఎవరూ ఎన్నుకోలేదని కూడా జగన్ అంటున్నారు. ఇలాంటివి చూసినపుడు ఎన్నికల సంస్కరణల అవసరం ఎంత ఉందో మరింతగా అర్ధం అవుతోంది అన్నట్లుగా జగన్ మాట్లాడారు. మొత్తానికి ఒక వైపు అర్బన్ బాడీస్ లో కూటమి విజయ పరంపర కొనసాగింది. వైసీపీ దారుణంగా ఓటమిని అందుకుంది. దీనికి జగన్ నుంచి వచ్చిన రియాక్షన్ ఇలా షాకింగ్ గానే ఉంది. ఓటమి ఎపుడూ బాధాకరంగానే ఉంటుంది. ప్రత్యర్థి గెలుపుని కూడా తక్కువ చేసి చూడడం జరుగుతుంది. వైసీపీ విషయం తీసుకుంటే తమకు చాన్స్ ఇవ్వలేదని ఆరోపిస్తోంది. అదే సమయంలో ఏపీలో పారదర్శకంగానే ఎన్నికలు జరిగాయని అధికార పక్షం అంటోంది. ఈ రెండు కామెంట్స్ కి మధ్యలో ప్రేక్షకులు మాత్రం ప్రజలు. వారికి అన్నీ తెలుసు. ఎవరేమి మాట్లాడినా అందులో ఎంత మేరకు నిజం ఉంది అన్నది ఇంకా బాగా తెలుసు అంటున్నారు.

ఏపీలో మరో ఎన్నికల పోరు..!



ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసింది. కూటమి పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా విజయదుందుభి మోగించాయి. ఇక, ఈ పరంపరలో తాజాగా పరిషత్ ఎన్నికల పోలింగ్ కూడా వచ్చేసింది. ఇప్పటికే ప్రచారం కూడా పూర్తయిన ఈ ఎన్నికలు గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లోనూ కొన్ని చోట్ల ఏకగ్రీవాలు జరగ్గా.. మెజారిటీ ఎంపీటీసీ, జిల్లా పరిషత్ స్థానాల్లో కీలక పోరు సాగనుంది.తుఫాను నేపథ్యంలో ఎన్నికలను వాయిదా వేస్తారని.. బుధవారం ఉదయం వరకు ప్రచారం జరిగినా.. అలా ఏమీ లేదని ఎన్నికల సంఘం ప్రకటించింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపింది. తుపాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో వరదలు, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా తుపాను ప్రభావం, వరదల పరిస్థితులు, పోలింగ్ నిర్వహణకు ఎదురవుతున్న ఇబ్బందులపై సమీక్షించారు. చాలా జిల్లాల్లో వరదలు తగ్గుముఖం పట్టాయని, ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు లేవని కలెక్టర్లు నివేదించారు. కలెక్టర్ల నివేదికలను పరిశీలించిన అనంతరం, పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయాలని పునేఠా అధికారులను ఆదేశించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు కొనసాగనున్నాయి.

ఇక్కడ మాత్రమే..

మురసు' తుఫాన్ ప్రభావంతో కొన్ని మండలాల్లో ఎంపీటీసీ, జిల్లాల్లో జిల్లాపరిషత్ ఎన్నికలను వాయిదా వేశారు. గుంటూరు జిల్లాలోని పెదనందిపాడు, కాకుమాను, ఫిరంగిపురం మండలాల్లో జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడ్డాయి. అలానే బాపట్ల జిల్లా పరిధిలోని పరుచూరు సహా.. ఇతర మండలాల్లో పూర్తిగా ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో వరద పోటు పెరగడంతో ఎన్నికల సామగ్రిని సైతం అధికారులు ఆయా ప్రాంతాలకు పంపించలేని పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ మాత్రమే ఎన్నికలను వాయిదా వేస్తూ.. నిర్ణయం తీసుకున్నారు.

నాన్నగారి ఆశయాలు నెరవేరుస్తా: రాధా ఫస్ట్ స్పీచ్



విజయవాడ కార్పొరేషన్ పరిధిలో జనసేన పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా విజయం దక్కించుకున్న వంగవీటి రంగా వారసుడు వంగవీటి రాధాకృష్ణ.. తాజాగా మీడియా ముందుకు వచ్చారు. ఈ ఎన్నికల్లో విజయవాడలో 52 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. అయినప్పటికీ.. రాధాకు లక్షా 35 వేల ఓట్ల మెజారిటీ దక్కింది. వాస్తవానికి పోటీ కూడా తీవ్రంగానే సాగింది. ఇండిపెండెంట్ అభ్యర్థిగా దిగిన మాజీ ఐపీఎస్ ఏబీవీ గట్టి పోటీ ఇస్తారని అనుకున్నారు. ఇక వైసీపీ తరపున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి సైతం గట్టి పోటీనే ఇచ్చారు.

అయినప్పటికీ.. ప్రజలు మాత్రం రంగా వారసుడి వెంటే నిలిచినట్టు స్పష్టం అయింది. అదేసమయంలో కులాల కు, సామాజిక వర్గ పోరుకు భిన్నంగా కూడా ఈఎన్నికలు ప్రభావం చూపాయి. ఈ నేపథ్యంలో రాధా మీడియాతో మాట్లాడుతూ.. తన తండ్రి రంగా ఆశీస్సులతోనే ఈ విజయం దక్కిందని భావిస్తున్నట్టు తెలిపారు. కూటమి పార్టీల నాయకులు తనకు అన్ని విధాలా సహకారం అందించారని.. ప్రతి ఒక్కరూ సహకరించారని తెలిపారు. విజయవాడ నగరంతోనే తమ కుటుంబ రాజకీయాలు ప్రారంభమయ్యాయన్నారు.

తన తండ్రి, తాను కూడా విజయవాడ నగర ప్రజలకు ఎంతో రుణపడి ఉన్నామన్న రాధా.. తండ్రి ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. అదేసమయంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఈ విషయం ప్రజలదేనని వ్యాఖ్యానించారు. రంగా అభిమానులు, రాధా-రంగా మిత్రమండలి కూడా ఈ విజయానికి ఎంతో కృషి చేసినట్టు రాధా చెప్పారు. నగరంలో అనేక సమస్యలు ఉన్నాయని.. వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

సుదీర్ఘ విరామం..

రాధాకు సుదీర్ఘ విరామం తర్వాత.. ఈ విజయం దక్కడం గమనార్హం. 2004లో తొలిసారి విజయవాడ తూర్పు నుంచి ఆయన పోటీ చేసి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత.. పలు పార్టీలు మారి పోటీ చేసినా ఆయన విజయం దక్కించుకోలేదు. గత ఎన్నికల్లో అసలు టికెట్ కూడా దక్కలేదు. ఇక, తాజాగా జనసేన తీర్థం పుచ్చుకుని కూటమి తరపున మేయర్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం దక్కించుకోవడంతో రంగా అభిమానులు.. పాతతరం నాయకులు కూడా రాధాను అభినందిస్తున్నారు.

రాప్తాడు నిందితుడిపై కాల్పుల కేసులో కీలక పరిణామం



అనంతపురం జిల్లా రాప్తాడులో నిందితుడు ఓ బాలికపై చేసిన దారుణ దాడికి యావత్ భారత్ కలకలం చెందింది. ప్రస్తుతం బాలిక బెంగళూరులో చికిత్స పొందుతోంది. ఇక రాప్తాడు నిందితుడిని అదవుల్లో పోలీసులు కాల్పులు జరపడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం అతడి కాలును తీసేయాల్సి వచ్చింది. అయితే అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగిన ఈ వ్యవహారంపై హైకోర్టులో పిటీషన్ దాఖలైంది.పోలీసులు నిందితుడిపై జరిపిన కాల్పులపై ఏపీ హైకోర్టులో ఓ న్యాయవాది పిటీషన్ దాఖలు చేయడంతో సంచలనమైంది. అతడిని ఆస్పత్రిలోకి ఈడ్చుకెళ్లిన వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరారు. నిందితుడిపై ఆరు రౌండ్ల కాల్పులు జరపాల్సిన అవసరం ఏంటి? కాల్పుల సమయంలో నెలకొన్న పరిస్థితులు ఏమిటో తెలియజేయాలని పిటీషన్ లో పేర్కొన్నారు. నిందితుడి కాళ్లకు బుల్లెట్ గాయాలతోపాటు ముఖంపై కూడా గాయాలు కావడంపై ఆరాతీసింది. అవి ఎలా ఏర్పడ్డాయి? వాటికి కాల్పులతో సంబంధం ఉందా? అటవీ ప్రాంతంలో పడిపోవడం వల్లే గాయాలయ్యాయన్న పోలీసుల వివరణలో వాస్తవమెంత అనే అంశాలను వైద్య, ఫోరెన్సిక్ ఆధారాలతో నిర్ధారించాలని కోరారు.గాయపడిన వ్యక్తిని తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఆస్పత్రిలోకి ఈడ్చుకెళ్లడం వల్ల అతడి గాయాలు మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉందని.. వీటిపై విచారణ జరపాలని పిటీషన్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.

అనంతపురం జిల్లా రాప్తాడు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అడ్డువచ్చిన మరో విద్యార్థినిపై దాడికి పాల్పడిన విషయం తెలిసిందే.. తీవ్రంగా గాయపడిన బాలిక ప్రస్తుతం బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.ఈ వ్యవహారం హైకోర్టు కు ఎక్కడం.. నిందితుడి కాల్పులపై న్యాయవాది పలు ప్రశ్నలు లేవనెత్తడంతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశమైంది.

పాపం షర్మిల.. ఇంత హర్ట్ అవుతారనుకోలేదా ..?



ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు.. వైఎస్ షర్మిల తాజాగా జరిగిన స్థానిక ఎన్నికల విషయంలో తీవ్రంగానే హర్ట్ అయి నట్టు ఉన్నారు. కాంగ్రెస్ తరపున అభ్యర్థులు పోటీ చేసినా.. ఒకటి రెండు చోట్ల కూడా.. గెలుపు గుర్రం ఎక్కుతారని అనుకున్నా.. అందరూ చతికిల పడ్డారు. కనీసం పోటీ కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఒకచోట మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి 240 ఓట్లు తెచ్చుకున్నారు. మరో చోట 20 నుంచి 50 ఓట్ల మధ్య మాత్రమే దక్కాయి. ఈ పరిణామాలు సహజంగానే జీర్ణించుకోలేక పోయారు షర్మిల.

దీంతో కూటమి సర్కారుపై తీవ్రస్థాయిలో ఆక్రోశించారు. "ఓట్లు మీరే వేసుకున్నారు.. గెలుపు మీదేనని ప్రకటించు కున్నారు. ఇంకా ప్రజలతో, ప్రజాస్వామ్యంతో పనేంటి ? ఎన్నికల్లో పారదర్శకత అనేదానికి విలువేంటి ? స్వేచ్ఛ, నిష్పక్షపాతం అనేదానికి అర్థం ఏంటి ?" అని ఎక్స్‌లో సుదీర్ఘపోస్టు పెట్టారు. అంతేకాదు.. ఇది ప్రజా తీర్పు కాదని తేల్చేశారు. కూటమి పార్టీల నిజమైన జయభేరి కాదని,. ప్రజల గొంతు నొక్కి, ప్రతిపక్షాలను అణచివేసి, సాధించిన బలవంతపు గెలుపగా షర్మిల అభివర్ణించారు.

షర్మిల చేసిందేంటి?

వాస్తవానికి ఇప్పుడు కూటమిపై విమర్శలు చేస్తున్న షర్మిల.. కీలక ఎన్నికల సమయంలో ఏం చేశారన్నది ప్రశ్న. ఎన్నికల వేళ కుమార్తె వివాహం ఉందన్న కారణంగా.. అసలు అభ్యర్థుల ఎంపికపైనే ఆమె దృష్టి పెట్టలేదు. అంతేకాదు.. అసలు ఈ విషయంతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నట్టుగానే ఆమె వ్యవహరించారు. కనీసం క్షేత్ర స్థాయిలో కూటమి బలాబలాలు ఎలా ఉన్నాయి? కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న మద్దతు ఎంత? ఎవరిని నిలిపితే.. గెలుస్తారు? అనే ముఖ్యమైన నాలుగు పాయింట్లను కూడా ఆమె పట్టించుకోలేక పోవడం గమనార్హం.

ఎవరికి వారే..

షర్మిల దాదాపు కాడి పడేయడంతో క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకులు కూడా ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిం చారు. ఎక్కడికక్కడ నాయకులు ఇష్టానుసారంగానే వ్యవహరించారు. ప్రజలను కలుసుకున్నది.. వారిని తమ వైపు తిప్పుకొన్నది కూడా లేదు. దీంతో కాంగ్రెస్‌కు-ప్రజలకు మధ్య దూరం పెరిగిపోయింది. మరోవైపు.. కీలక ఎన్నికల సమయంలోనే సోదరుడు జగన్‌తో జగడం పెట్టుకోవడం.. బెంగళూరు ప్యాలెస్‌ను తన కుమార్తె వివాహానికి ఇవ్వడం లేదన్న విషయాన్ని భారీ ఎత్తున హైలెట్ చేయడంతో ఇది కూడా.. షర్మిల రాజకీయాలపై మరకలు పడేలా చేసిందన్న వాదన ఉంది.ఈ నేపథ్యంలోనే ప్రజలు పూర్తిగా కాంగ్రెస్ ను మరిచిపోయారు. ఇలా సంస్థాగతంగా, వ్యక్తిగతంగా అనేక లోపాలు పెట్టుకుని.. వాటిని సరిచేసుకునేందుకు కూడా దృష్టి పెట్టని షర్మిల.. ఇప్పుడు ప్రజలు ఇచ్చిన తీర్పునకు పెడార్థాలు తీయడంలో ఔచిత్యం ఏంటన్నది కూటమిలోని కొందరు నాయకులు అడుగుతున్న ప్రశ్న. ముందు సొంత ఇంటిని చక్క బెట్టుకుని ప్రజల మెప్పు పొందాలని కొందరు సూచిస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

అమెరికా కాంగ్రెస్‌లోకి మరో భారత సంతతి మహిళ.. ఫ్లోరిడాలో పియా దండియా చారిత్రాత్మక విజయం!



అమెరికా రాజకీయాల్లో భారత సంతతికి చెందిన మరో మహిళ చరిత్ర సృష్టించారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి పియా దండియా.. ఫ్లోరిడాలోని 22వ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి విజయం సాధించి అమెరికా ప్రతినిధుల సభ లో అడుగుపెట్టనున్నారు. నవంబర్ 3న జరిగిన మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి కేసీ ఆస్కర్‌పై ఆమె గెలుపొందారు.ఈ ఎన్నికల్లో పియా దండియాకు 51.9 శాతం ఓట్లు లభించగా, కేసీ ఆస్కర్ 48.1 శాతం ఓట్లతో పరాజయం పాలయ్యారు. ఈ విజయంతో ఫ్లోరిడా నుంచి అమెరికా కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి భారత సంతతి ప్రతినిధిగా పియా గుర్తింపు పొందారు. అలాగే ప్రమీలా జయపాల్ తర్వాత అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికైన రెండో భారతీయ సంతతి మహిళగా నిలిచారు.పామ్ బీచ్ కౌంటీలో భారతీయ వలసదారుల కుటుంబంలో జన్మించి పెరిగిన పియా.. తొలుత ఉపాధ్యాయురాలిగా తన కెరీర్ ప్రారంభించారు. అనంతరం న్యూయార్క్‌లోని హార్లెమ్ ప్రాంతంలో హైస్కూల్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. వైట్ హౌస్ ఫెలోగా అమెరికా విద్యాశాఖలో సేవలందించడంతో పాటు యాపిల్ సంస్థలోనూ పనిచేశారు.తన ఎన్నికల ప్రచారంలో విద్య, వైద్య సదుపాయాలు, పెరుగుతున్న జీవన వ్యయం, ఉపాధి అవకాశాలను ప్రధాన అంశాలుగా ప్రస్తావించారు. కొత్తగా పునర్విభజించిన ఫ్లోరిడా 22వ నియోజకవర్గం నుంచి ఆమె విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. 2027 జనవరిలో కొత్త కాంగ్రెస్ సమావేశమైనప్పుడు ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇదిలా ఉంటే.. 2026 అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. డెమొక్రాట్లు ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ మెజారిటీ సాధించారు. దీంతో ట్రంప్ ప్రభుత్వానికి మిగిలిన రెండేళ్ల పాలనలో చట్టాల ఆమోదం, కీలక నియామకాల విషయంలో ప్రతిపక్షం నుంచి మరింత రాజకీయ సవాళ్లు ఎదురయ్యే అవకాశముంది.

సుప్రీంషాక్: దిగొచ్చిన ఎన్నికల సంఘం.. బిగ్ రిలీఫ్!



కాంగ్రెస్ పార్టీ సహా విపక్షాల ఆందోళనలు ఒకవైపు, సుప్రీంకోర్టు ఆదేశాలు, వ్యాఖ్యలు మరోవైపు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో తీసుకున్న నిర్ణయాలను ఒక్కొక్కటిగా వెనక్కి తీసుకుంటోంది. తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం.. ఫాం-6 కింద కొత్తగా ఓటరుగా నమోదయ్యేందుకు అవకాశం కల్పిస్తూనే.. ఇలాంటివారిపై సెక్షన్ 31 కింద ఎలాంటికేసులు కూడా పెట్టవద్దని ఆదేశాలు జారీ చేసింది. నిజానికి ఈ సెక్షన్.. కేసులు పెట్టేందుకు అవకాశంక ల్పిస్తున్నా.. అవి నకిలీ ఓటర్లకు మాత్రమే వర్తిస్తాయి. కానీ ఎన్నికల సంఘం తగుదనమ్మా.. అంటూ.. కొన్నాళ్ల కిందట ఈ సెక్షన్‌ను అందరికీ వర్తింప చేసింది.

అంటే.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ(సర్)లో ఓటు కోల్పోయిన వారు ఉన్నారని అనుకుందాం.. వారు తిరిగి ఓటు హక్కు పొందడం ఎలా? అంటే.. ఫాం-6 మాత్రమే వారికి గతి!. అయితే.. ఈ విషయంలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రెండు మాసాల కిందట కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఒకసారి సర్ ప్రక్రియలో ఓటు కోల్పోయిన వారు.. ఫాం-6 కింద కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేస్తే.. అలాంటి వారిని గుర్తించి సెక్షన్ 31 కింద క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశించారు. ఈ వ్యవహారం అప్పటికే సర్ ప్రక్రియ ముగిసిన పంజాబ్, ఢిల్లీ, బీహార్ వంటి రాష్ట్రాల్లో తీవ్ర విమర్శలకు, ఉద్యమాలకు కూడా దారితీసింది.దీనిపై సుప్రీంకోర్టు కూడా కీలక ఆదేశాలు జారీ చేసింది. సర్ ప్రక్రియ పక్కాగా నిర్వహించినా.. ఓటుకోల్పోయినవారు ఫాం-6 ద్వారా దరఖాస్తు చేసుకుంటే.. ఇలా ఎందుకు కేసులు పెడుతున్నారని నిలదీసింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా కేసులను తీవ్రంగా పరిగణించి.. ఉద్యమించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఎన్నికల సంఘం మంగళవారం రాత్రి కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పాత జాబితాలో ఓటు హక్కు కోల్పోయిన వారు కూడా ఫాం-6 కింద దరఖాస్తు చేసుకుంటే.. పరిశీలించి ఓటు హక్కు కల్పించాలని.. అలాంటి వారిపై కేసులు పెట్టరాదని తేల్చి చెప్పింది. ఈ మేరకు సర్ ప్రక్రియ పూర్తయిన అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.

అలానే.. ఒక ఓటరుకు రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే.. వాటిపై కూడా కేసులు పెట్టరాదని తేల్చి చెప్పింది. దీనిపై ఓటర్లకు సరైన అవగాహన కల్పించాలని సూచించింది. స్థానికంగా వారికి అర్థమయ్యే భాషలో వివరించడంతోపాటు.. ఏదో ఒక నియోజకవర్గంలోనే ఓటును కొనసాగించుకునే స్వేచ్ఛను కూడా వారికి ఇవ్వాలని పేర్కొంది. ఈ విషయంలోతలెత్తే వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించాలని ఆదేశించింది. కేసుల జోలికి పోరాదని తేల్చి చెప్పింది. మొత్తంగా తీవ్ర వివాదానికి దారితీసిన ఫాం-6పై ఇప్పటికే రెండు రూపాల్లో తన నిర్ణయాలను కేంద్ర ఎన్నికల సంఘం వెనక్కి తీసుకోవడం గమనార్హం. ఫాం-6 దాఖలు చేసే వారు 2002 నాటి జాబితాలోని తమ తాతలు, పెద్దల ఓట్లను ఇవ్వాలన్న ఆదేశాలను సుప్రీంకోర్టు జోక్యంతో గతంలో వెనక్కి తీసుకోగా.. ఇప్పుడు కేసులు పెట్టరాదని నిర్ణయించడం గమనార్హం.

ఓటువేయలేదుగా.. నా డబ్బులు నాకివ్వండి..
వైసీపీ అభ్యర్థి 'రివర్స్ వసూళ్లు' వైరల్



ఎన్నికలు అంటేనే మహా ప్రహసనం.. అందులో గెలుపోటములు సహజం.. ప్రచారం చేయడం.. హామీలివ్వడం.. మైకుల మోతలు.. అబ్బో అదో పే..ద్ద ప్రాసెస్.. ఇక పోలింగ్ ముందు రాత్రి జరిగే 'లక్ష్మీ కటాక్షం' గారడీలు ఇంకో ఎత్తు. సాధారణంగా ఓట్లు వేయించుకోవడానికి నాయకులు ప్రజల కాళ్ల వేళ్లా పడి డబ్బులు పంచుతుంటారు. కానీ ఏపీలోని ఓ నేత మాత్రం రివర్స్ ట్రెండ్ ను ఫాలో అవుతున్నారు. గెలుపు కోసం ఉన్నదంతా ఊడ్చి పెట్టిన వారు ఓడిపోతే పరిస్థితి ఏంటి? తట్టుకోలేక ఇప్పుడు పంచిన డబ్బులు తిరిగి ఇవ్వాలని రివర్స్ వసూళ్లు మొదలుపెట్టారు.. 'ఓడిపోయాను సామీ.. ఇచ్చేసిన నా డబ్బులు నాకిచ్చేయండి' అంటూ ఓటర్ల ఇళ్ల ముందు రివర్స్ వసూళ్లు మొదలుపెట్టాడు.ఇదే ఇప్పుడు వైరల్ అవుతోంది.చిత్తూరు జిల్లా పలమనేరు మున్సిపాలిటీ 32వ వార్డు నుంచి పోటీచేసిన వైసీపీ అభ్యర్థి ప్రసాద్ రెడ్డి గారు ఈ వినూత్న ఘట్టానికి కథానాయకుడు. ఎన్నికల ప్రచారంలో మనోడు ఏకంగా రూ.10 లక్షలు అప్పు తీసుకువచ్చి ఒక్కో ఓటుకు రూపాయి తక్కువ కాకుండా రూ.1000 చొప్పున బ్రహ్మాండంగా పంచేశాడు. ఇక ధీమాగా కొండంత ఆశతో గెలుస్తానని ఆశల పల్లకీలో ఊరేగాడు. తీరా కౌంటింగ్ రోజు ట్రైన్ రివర్స్ అయ్యింది. బ్యాలెట్లు తెరిచిచూస్తే ఓటర్లు ఈయన గారికి గట్టి షాక్ ఇచ్చారు.డబ్బులు తీసుకున్న వారిలో ఏకంగా 400 మంది తనకు ఓటు వేయలేదని తేలడంతో ప్రసాద్ రెడ్డి మైండ్ బ్లాంక్ అయిపోయింది పాపం.. సాధారణ నాయకులైతే అయ్యో మన దురదృష్టం అని మూలన కూర్చొని ఏడుస్తారు. కానీ మన రెడ్డిగారు సాధారణ నాయకుడు కాదాయే.. వెంటనే ఓ వీడియో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో వదిలాడు. 'నేను అప్పు తెచ్చి మీ మొహాన వెయ్యి రూపాయలు పెట్టా.. కానీ మీరు నాకు ఓటు వేయకుండా నన్ను ముంచేశారు. మర్యాదగా నా డబ్బులు నాకు ఇచ్చేయండి.. లేకపోతే రోజూ మీ ఇళ్ల ముందు వచ్చి ధర్నాకు కూర్చుంటా' అంటూ ఓటర్లకు సీరియస్ వార్నింగ్ ఇచ్చాడు. దీంతో వార్డులోని జనాలకు ఇప్పుడు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు.. ఓటుకు డబ్బులు పంచడం నేరం అని విన్నాం కానీ.. ఆ డబ్బులకు కూడా రీఫండ్ పాలసీ ఉంటుందని ఇప్పుడే చూస్తున్నామని ఊర్లో జనాలు సెటైర్లు వేస్తున్నారు..అమెజాన్, ఫ్లిప్ కార్ట్ లాంటి షాపింగ్ యాప్స్ లో ఉండే 10రోజుల రిటర్న్ పాలసీని ఎన్నికల రాజకీయంలోకి తీసుకొచ్చిన ప్రసాద్ రెడ్డి క్రియేటివిటీకి మనమంతా హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే..

పాపం ఏబీవీ : సోషల్ మీడియా హైప్....డిపాజిట్ గల్లంతు



ఏబీ వెంకటేశ్వరరావు అంటే ఎంత మందికి తెలుసు. ఇది మొదటి ప్రశ్న. ఆయన గురించి పాత్రికేయులకు అధికార వర్గాలకు పై స్థాయి రాజకీయ వర్గాలకు మాత్రమే తెలుసు. అయితే ఆయన ఇంటెలిజెన్స్ చీఫ్ గా ఉన్నపుడు వైసీపీ వారు టార్గెట్ చేయడం వల్ల కొంత వరకూ ఒక సెక్షన్ ఆఫ్ గ్రూప్ ద్వారా మాత్రమే వార్తలలో ఎక్కువగా వినిపించి కనిపించేవారు.. ఆయన రిటైర్ అయిన తరువాత రాజకీయాల మీద ఆసక్తితో ఉన్నారు. వామపక్షాలు ప్రజా సంఘాలతో కలసి వివిధ అంశాల మీద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తూ కొంత వరకూ మీడియా అటెన్షన్ సంపాదించారు. అలాంటిది ఆయన ఒక్కసారిగా విజయవాడ మేయర్ బరిలో పోటీ చేయడానికి సిద్ధపడడం ఒక పెద్ద సర్ ప్రైజ్. పైగా ఇండిపెండెంట్ గా. రెండు ప్రధాన పార్టీలు బలంగా ఉన్న చోట ఆయన పోటీకి దిగడం పెద్ద రిస్క్ అని అంతా అనుకుంటూనే ఉన్నారు. అయితే సోషల్ మీడియా మాత్రం ఏబీ వెంకటేశ్వరరావు బరిలోకి దిగడంతో మొత్తం సమీకరణలు మారిపోతాయన్నట్లుగా హైప్ క్రియేట్ చేసింది. తీరా రిజల్ట్ చూస్తే ఆయన డిపాజిట్ గల్లంతు అయింది.

ఇద్దరు అభ్యర్థుల మధ్యలో :

ఇక విజయవాడ మేయర్ ఎన్నికల మీద ఎంతో కొంత ఆసక్తి కనిపించడానికి ఏబీవీ రేసులో ఉండడం ఒక కారణం కావచ్చు. అలాగే వంగవీటి రాధాకృష్ణ అవతల వైపు కూటమి నుంచి అభ్యర్థిగా ఉన్నారు. వైసీపీకి అయిదేళ్ళు మేయర్ గా చేసిన రాయన భాగ్యలక్ష్మి ఉన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన భాగ్యలక్ష్మికి వైసీపీ ఓటు బ్యాంక్ అండగా ఉంది. ఇక రాధాకు పటిష్టమైన కూటమి వెనక ఉంది. మరి ఈ ఇద్దరి మధ్యలో ఏబీవీ ఏ విధంగా రేసులో దూసుకుని వస్తారో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి హైప్ క్రియేట్ చేసిన వారికే తెలియాలి అని అంటున్నారు. అందుకే సోషల్ మీడియాలో ప్రచారం ఒక వైపుగా ఉంటే గ్రౌండ్ లెవెల్ లో రియాలిటీ స్పష్టంగా కనిపించింది. విజయవాడ మేయర్ ఎన్నికల్లో వంగవీటి రాధాకు 2,65,888 ఓట్లు, రాయన భాగ్యలక్ష్మికి 1,35,016 ఓట్లు వస్తే, ఏబీ వెంకటేశ్వరరావుకు 12,642 ఓట్లు మాత్రమే వచ్చాయి.

కీలకం అంటూ :

నిజానికి సోషల్ మీడియాను నమ్ముకుని ఏబీవీ దిగారా అన్నది ఒక చర్చ. అదే నిజం అనుకుంటే ఆయన రిస్క్ ని తానే ఆహ్వానించారనే అంటున్నారు. ఏబీవీ రంగంలోకి దిగడంతోనే ఆయన గెలిచేస్తారు అని సోషల్ మీడియాలో ఒక క్రియేషన్ సాగింది. అంతే కాదు ఆయన అటూ ఇటూ ఓట్లు చీల్చేసి ప్రధాన పార్టీలకు గండి కొడతారు అని కూడా ప్రచారం సాగింది. ఆ తరువాత చూస్తే ఆయనకూ వంగవీటి రాధాకు మధ్యనే పోటీ వైసీపీ మూడవ ప్లేస్ లోకి వెళ్తుందని కూడా ఇంకో ప్రచారం సాగింది. ఒక విధంగా ఏబీవీ అయితే విన్నర్ లేదా రన్నర్ అంటూ సాగిన ప్రచారం అంతా కేవలం ఆన్ లైన్ లోనే ఉంది. కానీ గ్రౌండ్ లెవెల్ లో అంత సీన్ లేదని ఫలితాలు నిరూపించాయి.

డిపాజిట్లు రావాలంటే :

ఇక ఏబీవీ సీనియర్ మోస్ట్ ఐపీఎస్ అధికారి, ఆయనకు అఫీషియల్ సెక్షన్లలో అయితే ప్రముఖ స్థానమే ఉంది. కానీ పాలిటిక్స్ అంటే మాస్ అప్పీల్ ఉండాలి. జనంతో మమేకం కావాలి. ఆయన ఇంకా మరి కొన్నాళ్ళు గ్రౌండ్ వర్క్ చేసి 2029 టార్గెట్ గా చేసుకుని ఎక్కడైనా ఎమ్మెల్యేగా ఎంపీగా పోటీ చేసి ఉంటే కథ వేరేగా ఉండేదేమో అన్న చర్చ కూడా ఇప్పుడు సాగుతోంది. అలా కాకుండా ఏబీవీ మేయర్ సీటుకు పోటీ చేయడం ముందే కోయిల కూసింది అన్నట్లుగా మారింది. ఇక ఆయనకు వచ్చిన ఓట్లు నికరంగా 12,000 ఓట్లు మాత్రమే. అదే సమయంలో వైసీపీ టీడీపీలకు లక్షల ఓట్లు వచ్చాయి. ఆయన కనుక డిపాజిట్ సాధించాలంటే మొత్తం పోలైన ఓట్లలో 16 శాతం ఓట్లు తెచ్చుకోవాల్సి ఉంది. కానీ వచ్చిన ఓట్లు చూస్తే డిపాజిట్ గల్లంతు అయింది అని అంటున్నారు. ఇది ఏబీవీకి ఊహించని ఫలితం అని అంటున్నా ఆయన సోషల్ మీడియా భ్రమలో పడి పోటీ చేసిన ఫలితం ఇది అని కూడా కామెంట్స్ వస్తున్నాయి.

టికెట్ ధరలపై జీవీ విజయ్ ముందు చూపు మనవాళ్లకు ఏదీ?



ఒక వస్తువును కొనాలంటే సగటు వినియోగదారుడు ముందుగా చూసేది దాని ధరనే. ఆ ధర అందుబాటులో ఉండి నచ్చితేనే కొనుగోలు చేస్తాడు. వ్యాపార సూత్రాలన్నింటికీ వర్తించే ఈ నియమం సినిమా టికెట్లకు కూడా వర్తిస్తుంది. కానీ.. ఎంత ధర విధించినా ప్రేక్షకులు టికెట్లు కొని థియేటర్లకు వస్తారనే అత్యాశ, విచ్చలవిడిగా టికెట్ ధరలను పెంచే ధోరణి చివరికి సినిమా పరిశ్రమకే తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని ట్రేడ్ విశ్లేషకులు హెచ్చరిస్తూనే ఉన్నారు. టికెట్ ధరలు .. వాటితో పాటు థియేటర్లలో తిండి పదార్థాల (పాప్‌కార్న్, కూల్‌డ్రింక్స్) ధరల భారం లేకుండా ఉంటే థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య అమాంతం పెరుగుతుందని కూడా విశ్లేషిస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణల్లో పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. ఇక్కడ పెద్ద సినిమాలు విడుదలవుతున్నాయంటే చాలు.. వందల రూపాయల మేర టికెట్ ధరలు పెంచుకోవడానికి ప్రభుత్వాలు త్వరితగతిన జీవోలు జారీ చేస్తున్నాయి. ఇక్కడ ధరలు పెంచడం సులభమే కావచ్చు.. కానీ ఈ భారీ ధరల భారం సగటు కుటుంబాల మైండ్‌సెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పెరిగిన ధరలతో జనం థియేటర్లకు దూరమై ఓటీటీల వైపు మళ్లుతున్నారనే నిజాన్ని సినీ పెద్దలు, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విచారకరం.ఈ నేపథ్యంలో పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోని టీవీకే సీఎం విజయ్ ప్రభుత్వం తీసుకున్న ముందుచూపు నిర్ణయంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రశంసలు కురుస్తున్నాయి. ఎక్కువ మంది సాధారణ ప్రజలను థియేటర్లకు రప్పించడమే లక్ష్యంగా విజయ్ సర్కార్ సరికొత్త జీవోను జారీ చేసింది. పెరిగిన టికెట్ ధరల వల్లే జనం థియేటర్లకు రావడం లేదని గ్రహించిన దళపతి విజయ్.. ప్రేక్షకుల సంక్షేమం కోణంలో ఆలోచించి ఏ సినిమాకి టికెట్ ధరలను పెంచే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ అభ్యర్థనలను తిరస్కరించారు.అయితే నిర్మాతలు నష్టపోకుండా ఉండేందుకు ఒక ప్రత్యామ్నాయ అవకాశాన్ని విజయ్ ప్రభుత్వం కల్పించింది. కొత్త జీవో ప్రకారం.. సినిమాలు విడుదలైన మొదటి వారంలో ఉదయం 6 గంటల నుంచి తెల్లవారుజామున 2:30 గంటల వరకు ప్రదర్శించుకోవచ్చు. వారాంతాలు, పండుగలు.. ప్రభుత్వ సెలవు దినాల్లో రోజుకు ఆరు షోలు వేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. చాలా కాలం తర్వాత ఉదయం 6 గంటల షోల సౌకర్యాన్ని ఉపయోగించుకుంటున్న మొదటి కోలీవుడ్ భారీ చిత్రంగా సూర్య నటించిన -సీన్- నిలవనుంది. ధరలు పెంచకుండా షోల సంఖ్యను పెంచడం ద్వారా ఇటు నిర్మాతలకు కలెక్షన్లు పెరిగి.. అటు సగటు ప్రేక్షకుడికి రీజనబుల్ ధరకే సినిమా వినోదం అందుతుంది. తమిళనాడు ప్రభుత్వం చూపిన ఈ దార్శనికతను తమిళ సినీ అభిమానులు హర్షిస్తున్నారు. మరి ఈ తరహా ప్రజానుకూల.. ఇండస్ట్రీ-ఫ్రెండ్లీ నిర్ణయాలను తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు, సినీ ప్రముఖులు ఎప్పుడు తీసుకుంటారు? మనవాళ్లకు ఈ ముందుచూపు ఎప్పుడు వస్తుంది? అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.



మొటిమంత బెంగ

ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు.

ఇది మొటిమల అవగాహన మాసం

ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు. తెగ ఆందోళన పడిపోతుంటారు. మనో వేదనకూ గురవుతుంటారు. మొటిమల మీద లెక్కలేనన్ని అపోహలూ రాజ్యమేలుతుండటం, సరైన అవగాహన లేకపోవటమే దీనికి కారణం.

అప్పటివరకూ నునుపుగా ఉన్న ముఖం మీద ఏంటీ మొటిమలు? ఒకట్రెండు కాస్తా చూస్తుండగానే సంఖ్య పెరుగుతూ వస్తోందేంటి? అందానికి, ఆకర్షణకు అత్యంత ప్రాధాన్యమిచ్చే యుక్తవయసువారిలో ఇలాంటి ఆలోచనలే ముసురుకుంటుంటాయి. ఇంతకీ ఇవి ఎలా పుట్టుకొస్తాయి? ఆశ్చర్యంగా అనిపించినా చర్మం నిగనిగలాడుతూ కనిపించటానికి తోడ్పడే చమురు గ్రంథులే మొటిమలకు కారణం! శరీరం మీద చర్మం అంతటా సన్నటి వెంట్రుకలు, వాటి కుదుళ్లుంటాయి. ప్రతి కుదురులో వెంట్రుక మొదలు (ఫాలికల్), చమురు గ్రంథులు (సెబేషియస్ గ్లాండ్స్) ఉంటాయి. గ్రంథుల నుంచి ఉత్పత్తయ్యే చమురు సన్నటి రంధ్రాల ద్వారా బయటకు వస్తుంది. ముఖం, ఛాతీ, వీపు, భుజాలు, చేతుల మీద ఈ గ్రంథులు పెద్ద సంఖ్యలో ఉంటాయి. ఇవి వాచి, ఉబ్బి.. గుల్లల మాదిరిగా పైకి పొడుచుకు రావటమే మొటిమలకు మూలం. కొందరిలో జన్యుపరంగా టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు గ్రంథులను ప్రేరేపితం చేయటం వల్ల మరింతగా చమురు ఉత్పత్తి అవుతుంది. మరోవైపు చర్మ రంధ్రాల్లో ప్రొపిని బ్యాక్టీరియం ఆక్నిస్ అనే బ్యాక్టీరియా చమురును కొవ్వు ఆమ్లాలుగా విడగొడుతుంటుంది. ఈ ఆమ్లాలు వెంట్రుక కుదురును ప్రేరేపించే క్రమంలో కెరటిన్ పదార్థం ఎక్కువగా ఉత్పత్తి అయ్యి, చర్మ రంధ్రాలు మూసుకుపోవచ్చు. దీంతో అక్కడ ఉబ్బుగా, గుల్ల మాదిరిగా ఏర్పడి.. మొటిమ తలెత్తుతుంది. ఇది క్రమంగా పెద్దగా అవుతూ రావొచ్చు. కొన్నిసార్లు చర్మ రంధ్ర మార్గం పగిలి, వాపు మొదలవ్వచ్చు. ఫలితంగా అక్కడ ఎర్రబడి, మొటిమ పొక్కులా పొడుచుకొస్తుంది. లోపల చీము చేరటం, చితకటం, గుంతలు పడటం.. అన్నీ దీని పర్యవసానాలే.

నాలుగు రకాలు

సాధారణంగా మనం మొటిమలన్నింటినీ ఒకే గాటన కట్టేస్తుంటాం. కానీ తెలుపు లేదా నలుపు గుల్లలు (బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్), చీము గుల్లలు (పశ్చులే), తిత్తులు (సిస్ట్స్).. ఇలా మొటిమలు రకరకాలుగా ఉంటాయి. తీవ్రతను బట్టి వీటిని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు.

గ్రేడ్ 1: చాలా సన్నగా, చిన్నగా ఉండేవి (కొమెడోన్స్). వైట్‌హెడ్స్, బ్లాక్‌హెడ్స్ ఇలాంటివే.

గ్రేడ్ 2: బ్లాక్‌హెడ్స్ ఇన్‌ఫెక్షన్‌కు గురై, చీము పట్టడం (పశ్చు లర్).

గ్రేడ్ 3: గుల్లలు ఇన్‌ఫెక్షన్‌తో వాచి, గడ్డ మాదిరిగా అవటం (నాడ్యులర్).

గ్రేడ్ 4: గడ్డ మరీ పెద్దగా, లావుగా ఉబ్బటం (నాడ్యులోసిస్టిక్).

ఆడవారిలో ఎక్కువ

మగవారిలో కన్నా ఆడవారికి మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశముంది. ఎందుకంటే వీరిలో హార్మోన్ల వ్యత్యాసాలు ఎక్కువ. ఆడవారిలో అండాశయాల్లో నీటి తిత్తులు (పీసీఓఎడీ), నెలసరి సరిగా రాకపోవటం, థైరాయిడ్ పనితీరు దెబ్బతినటం, టెస్టోస్టిరాన్ హార్మోన్ మోతాదులు అస్తవ్యస్తం కావటం వంటివీ మొటిమలు ఎక్కువగా వచ్చేలా చేయొచ్చు.

ఏ వయసులోనైనా..

మొటిమలు యుక్తవయసులోనే వస్తుంటాయని, ఆ తర్వాత వాటంతటవే పోతాయని చాలామంది భావిస్తుంటారు. నిజానికి వీటికి ఒక వయసంటూ లేదు. శిశువుల దగ్గరి నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా రావొచ్చు. కానీ సగటున 10-25 ఏళ్ల వయసులో ఎక్కువగా చూస్తుంటాం. అలాగని అక్కడితోనే ఆగిపోతాయని కచ్చితంగా చెప్పలేం. కొందరికి 20ల్లో, 30ల్లో, 40ల్లోనూ రావొచ్చు. కొందరు మహిళలకు యుక్తవయసులో కొద్దిగానే మొటిమలు వచ్చినా పెద్దయ్యాక తీవ్రంగానూ వేధించొచ్చు.

ముఖం మీదే కాదు..

మొటిమలు చాలావరకూ.. 99% ముఖం మీదే వస్తుంటాయి. నుదురు, బుగ్గలు, ముక్కు మీద ఇవి కనిపిస్తుంటాయి. చమురు గ్రంథులు లేకపోవటం వల్ల పెదవులు, పెదవుల పైభాగంలో మాత్రం రావు. కొందరికి ముఖం మీదే కాదు.. ఛాతీ, వీపు, చేతుల మీద కూడా రావొచ్చు.

గిల్లితే తగ్గవు

మొటిమలను గిల్లి, నొక్కి పిండితే త్వరగా తగ్గుతాయని కొందరు అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. గిల్లితే మొటిమలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శాశ్వతంగా మచ్చలు పడొచ్చు. ఇన్‌ఫెక్షన్ మరింత లోతుకు చొచ్చుకెళ్లి ముఖం మీద గుంతలు పడే ప్రమాదముంది. ఒకసారి గుంత పడితే పూర్తిగా మామూలు స్థాయికి తీసుకొచ్చే చికిత్సలేవీ లేవు. కాకపోతే గుంతల లోతును తగ్గించి, అంతగా కనిపించకుండా చేయొచ్చు.

గట్టిగా రుద్ది కడిగితే పోవు

ముఖాన్ని గట్టిగా, రుద్ది కడిగితే మొటిమలు పోతాయనుకోవటం అపోహ. దీంతో మొటిమలు తగ్గటం అటుంచి, మరింత ఎక్కువవుతాయి. ఇన్‌ఫెక్షన్ లోపలికి వెళ్లిపోయి, గుంతలు పడే అవకాశముంది. గట్టిగా రుద్దటం కన్నా రోజుకు రెండు సార్లు మృదువుగా తేలికైన, పరిమిళం లేని క్లీన్సర్‌తో ముఖాన్ని కడుక్కోవటం మంచిది. వేలి చివర్లతో క్లీన్సర్‌ను ముఖానికి రాసుకోవాలి. అనంతరం గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి.

కొందరు చర్మం రంధ్రాలు విప్పారతాయనే భావనతో ఆవిరి స్నానాలు చేస్తుంటారు. కానీ వీటితో మొటిమలు మరింత ఎక్కువవుతాయి.

ఆహారంతో పరోక్ష సంబంధం

రాత్రిపూట జంక్‌ఫుడ్ తిన్నా.. ఎక్కువ కేలరీల ఆహారం తిన్నా మొటిమలు ఎక్కువగా పుట్టుకురావొచ్చు. ఎందుకంటే శరీరం వాడుకోకుండా మిగిలిన కేలరీలు ఒంట్లో కొవ్వుగా మారతాయి. వీటి నుంచి టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు పుట్టుకొచ్చి మొటిమలను ప్రేరేపిస్తాయి. అందువల్ల సాయంత్రం ఆరు గంటల తర్వాత జంక్‌ఫుడ్, పెద్దమొత్తంలో పిండి పదార్థాలు.. పాల పదార్థాలు (పెరుగు మినహాయించి) తీసుకోవటం మానెయ్యాలి. స్వీట్లు, చాక్లెట్లు, కొవ్వు పదార్థాల వంటివి తగ్గించుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారంతో మొటిమల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా విటమిన్ ఏతో కూడిన పాలు (పగటిపూట), క్యారెట్, క్యాబేజీ, చిలగడ దుంపలు.. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు గల చేపలు, అక్రోట్లు.. జింక్‌తో కూడిన పదార్థాలు మొటిమలు ఉద్ధృతం కాకుండా కాపాడతాయి.

పౌడర్ కారణం కాదు

కొందరు ముఖానికి పౌడర్ రాసుకుంటే చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వస్తాయని భావిస్తుంటారు. ఇది అపోహే. కాకపోతే గాఢమైన కెమికల్ పీల్స్‌తో చమురు గ్రంథులు ఇంకాస్త పెద్దగా అవ్వచ్చు. ఫలితంగా మొటిమలు ఉద్ధృతమవుతాయి. కొన్ని స్టెరాయిడ్ క్రీములతోనూ ఇవి ఎక్కువ కావొచ్చు. కాబట్టి కెమికల్ పీల్స్ వాడకపోవటం మంచిది. సన్‌స్క్రీన్, మాయిశ్చరైజర్లయినా సరే.. నాన్ కామెడోజెనిక్ రకానికి చెందినవే ఉపయోగించాలి.

ఒత్తిడికి దూరంగా

మానసిక ఒత్తిడి, ఆందోళనలు మొటిమలకు కారణం కాకపోయినా అప్పటికే ఉన్నవి ఉద్ధృతమయ్యే అవకాశముంది. కాబట్టి మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. ధ్యానం, ప్రాణాయామం చేయాలి.

చికిత్స అవసరమా?

మొటిమలు ఆరోగ్యానికేమీ హాని కలిగించవు. కానీ వీటితో గుంతలు పడితే జీవితాంతం అలాగే ఉంటాయి. కాబట్టి చికిత్స తీసుకోవటం మంచిది. కొత్తగా మొటిమలు వస్తున్నా పెద్దగా ఆందోళన అవసరం లేదు. కానీ ఉన్నవి తగ్గకపోతుంటే మాత్రం చికిత్స అవసరం. అలాగే చీము పట్టటం, గడ్డలు ఏర్పడటం, ముఖమంతా నల్లటి మచ్చల్లా మారుతున్నా తాత్సారం చేయరాదు. చికిత్స ఉద్దేశం– మొటిమలు ఉద్ధృతం కాకుండా చూడటం.. తీవ్ర స్థాయి నుంచి స్వల్ప స్థాయికి తీసుకురావటం. సాధారణంగా ఒక వయసు వచ్చేసరికి మొటిమలు నియంత్రణలోకి వస్తాయి. అప్పటివరకూ డాక్టర్ పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే గుంతలు, మచ్చలు పడకుండా చూసుకోవచ్చు.

ఏంటీ చికిత్స

మామూలు వైట్, బ్లాక్‌హెడ్స్‌కు రెటినాల్ క్రీములు మేలు. ఇవి గడ్డకట్టిన కెరటిన్ విడిపోయేలా, చర్మ రంధ్రాలు తెరచుకునేలా చేస్తాయి.

చీము పడితే డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది.

మరీ తీవ్ర మొటిమలకు రెటినాయిడ్, విటమిన్ ఏ మాత్రలు ఉపయోగపడతాయి. ఇవి చమురు ఉత్పత్తిని తగ్గించి, రంధ్రాలు తిరిగి తెరచుకునేలా చేస్తాయి. అయితే వీటిని 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయసువారికే ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు డాక్టర్ సలహా తీసుకోకుండా తమకు తామే విటమిన్ ఏ మాత్రలను వేసుకోవటం ఎక్కువైంది. ఇది ప్రమాదకరం. యుక్తవయసులో ఇవి ఎదుగుదలను, చూపును దెబ్బతీయొచ్చు. సంతానం కోసం ప్రయత్నిస్తున్నవారు, గర్భిణులు, బాలింతలు వీటిని వాడటం మంచిది కాదు. కాబట్టి రక్త పరీక్ష చేయించుకొని, డాక్టర్ పర్యవేక్షణలోనే ఒక వయసు వచ్చేవరకూ వాడి, మానెయ్యాలి.

రెటినాల్ క్రీములు పడనివారికి శాల్సిలిక్ యాసిడ్ పీల్స్ మేలు చేస్తాయి.

మందులతో ఫలితం కనిపించవారికి, మందులు వాడటం కుదరనివారికి లేజర్ చికిత్సతో ఫలితం కనిపిస్తుంది. చికిత్సలతో రాత్రికి రాత్రే మొటిమలు తగ్గుతాయని అనుకోవద్దు. ఇవి పని చేయటానికి 4-8 వారాలు పడుతుంది.

మచ్చలు, గుంతలు పడితే?

మొటిమలతో మచ్చలు, గుంతలు పడితే చర్మం రకం, వయసు, జీవనశైలి, మచ్చల రకాన్ని బట్టి డెర్మారోలర్, కెమికల్ పీల్, మైక్రోనీడ్లింగ్ రేడియో ఫ్రీక్వెన్సీ, ఫ్రాక్షనల్ సీవో2 లేజర్, ఎర్బియం యాగ్ లేజర్.. వీటిల్లో ఏదో ఒకదాంతో చికిత్స చేయొచ్చు. లేజర్లు చర్మం కిందుండే కొలాజెన్‌ను దెబ్బతీస్తాయి. తర్వాత అక్కడ కొత్త కొలాజెన్ ఏర్పడుతుంది. ఈ క్రమంలో మచ్చలు, గుంతలు తగ్గుతాయి. అయితే గుంతలు పూర్తిగా పోవని గుర్తించాలి. 60-70% మాత్రమే పూడతాయి. గుంతలు ముఖానికి ఇబ్బంది కలిగించటం లేదని అనుకునేంతవరకూ చికిత్స తీసుకోవచ్చు.

మౌనం వ్యూహం కాదు!

అరుణాచల్ ప్రదేశ్‌లోని అసఫిలా, టక్సింగ్, లాంగ్జు ప్రాంతాల్లో చైనా సైన్యం (పీఎల్‌ఏ) అతిక్రమణలకు పాల్పడుతోందన్న వార్తలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. వాస్తవాలు స్పష్టంగా లేవు, అధికారికంగా అంగీకరించలేదు. కానీ ఈ సరిహద్దులో ఏదో అసాధారణంగా జరుగుతోందనడానికి సంకేతాలున్నాయి. జూన్ 26న 'నామ్‌వెల్ఫేర్ సొసైటీ' అనే స్థానిక గిరిజన సంఘం, చైనా సైన్యం టక్సింగ్ చుట్టుపక్కల భారత భూభాగాన్ని ఆక్రమించి, సంప్రదాయ మేత, వేట భూముల్లో రోడ్లు, వంతెనలు, శిబిరాలు నిర్మించిందని జిల్లా అధికారులకు లేఖ రాసింది. సైన్యం ఈ ఆరోపణలను "తప్పు, ఆధారం లేనివి" అని కొట్టిపారేసింది. చైనా సైనికులు భారత్ గుర్తించే వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ)కు ఆరు నుంచి ఏడు కిలోమీటర్ల లోపల గుడారాలు వేశారని నివేదికలు చెబుతున్నాయి. అక్టోబర్ 22న రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ సింగ్ కపూర్, "అరుణాచల్‌లో పలుచోట్ల ఎదురుపడిన పరిస్థితి వచ్చింది, అది ఇంకా కొనసాగుతోంది" అన్నారు; సమస్య ఎంత విస్తృతమో తెలిపిన తొలి అధికారిక మాట ఇదే. విదేశాంగ శాఖ ప్రతినిధి వివరాలకు రక్షణ శాఖను అడగమని చెబుతూ, చైనా బలగాలు నిర్దేశిత గస్తీ పద్ధతుల నుంచి పక్కకు తప్పినప్పుడు పరిస్థితి "అప్పుడప్పుడు చెదిరిపోతుంది" అన్నారు. చైనా ప్రతినిధి అక్టోబర్ 26న తమది "సాధారణ సరిహద్దు గస్తీ" అని చెప్పారు. ముఖ్యమంత్రి పెమా ఖాండూ అక్టోబర్ 29న ఇంకా స్పష్టంగా, "అతిక్రమణ జరిగింది, అది జరుగుతూనే ఉంటుంది" అన్నారు; మెక్‌మహాన్ రేఖను చైనా గుర్తించకపోవడమే కారణమన్నారు. ఏ పక్షమూ ఎదురుపడటాన్ని ఖండించలేదు. ఈ ప్రతిష్టంభన, ఆగస్టు 25న బీజింగ్‌లో జరిగిన 25వ ప్రత్యేక ప్రతినిధుల చర్చలు, సరిహద్దు వ్యవహారాల సంప్రదింపుల యంత్రాంగం (డబ్ల్యూఎంసీసీ) సమావేశాలు, సెప్టెంబర్ 12-13న న్యూఢిల్లీలో బ్రిక్స్ నదస్సుకు షీ జిన్‌పింగ్ దాదాపు ఏడేళ్ల తర్వాత చేసిన పర్యటన మధ్య కూడా కొనసాగిందని నివేదికలు చెబుతున్నాయి.

తూర్పు సెక్టార్‌లో చైనా అతిక్రమణలు కొత్తవి కావు. గతంలో అంతర్జాతీయ సరిహద్దుకు దక్షిణాన చైనా ఆక్రమణలు నామ్కా చూ, సుమ్డొరొంగ్ చూ లోయలు, లాంగ్జువంటి కొన్ని పాకెట్లకే పరిమితం; మిగతాచోట్ల ఎల్‌ఏసీ, సరిహద్దు ఒకటే. చైనా ఇప్పుడు మరింత లోతుగా చొరబడి ఉంటే, కొత్త ప్రాంతాల్లో నిలిచి ఉంటే, లేదా భారత గస్తీ బృందాలను కొన్ని ప్రాంతాలకు వెళ్లకుండా అడ్డుకుంటే, ఇది తీవ్రమైన పరిణామమే, అయితే ఊహించనిది కాదు. 2020లో తూర్పు లద్దాఖ్‌లో చేసినదాన్ని తూర్పు సెక్టార్‌లోనూ చైనా ప్రయత్నించవచ్చని చాలామంది హెచ్చరించారు. చైనా వ్యాఖ్యాతలు ఏమీ దాచుకోవడం లేదు: ఐటీబీపీ డీజీ మాట్లాడిన మరుసటి రోజే ఒకరు, చైనా "కనీస లక్ష్యం" 1959 రేఖను అమలు చేయడమేనని, పశ్చిమ సెక్టార్‌లో అది చాలావరకు సాధించిన చైనా తూర్పు సెక్టార్‌లోనూ అమలు చేసే అవకాశం "చాలా ఎక్కువ" అని రాశారు. 1959 నాటి ఎల్‌ఏసీకి భారత్ వద్ద విలువ లేదు. చైనా ఆ రేఖను 1914నాటి పటాల అక్షాంశాలను ప్రస్తుత పటాలపై బదిలీ చేసి, ఎత్తైన జలవిభాజక రేఖను విస్మరించి నిర్ణయిస్తుంది; ఈ పద్ధతి శాస్త్రీయం కాదని భారత్ ఎప్పుడూ అంగీకరించలేదు. ఎల్‌ఏసీ అంటే క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఉన్న నియంత్రణ రేఖ అని, ఊహాత్మక లేదా చారిత్రక రేఖ కాదని 1993 శాంతి, ప్రశాంతత ఒప్పందం చర్చల్లో భారత్ స్పష్టం చేసింది. 2005 రాజకీయ పారామితుల ఒప్పందం సరిహద్దు పరిష్కారంలో "సరిహద్దు ప్రాంతాల వాస్తవ పరిస్థితి"ని పరిగణనలోకి తీసుకోవాలని కూడా నిర్దేశిస్తుంది. చైనా అతిక్రమణలు ఎల్‌ఏసీని కచ్చితంగా గౌరవించాలని, యథాతథ స్థితిని ఏకపక్షంగా మార్చకూడదని చెప్పే ఒప్పందాలకు విరుద్ధం. పైగా చైనా ఇప్పుడు ఎల్‌ఏసీని సార్వభౌమత్వ పదాల్లో నిర్వచిస్తోంది, ఇది ఆ భావనకే విరుద్ధం, ఎందుకంటే 1993లో రెండు దేశాలు ఈ పదాన్ని తొలిసారి వాడినప్పుడు, ఎల్‌ఏసీ ప్రస్తావన సరిహద్దు అంశంపై తమ స్థానాలకు భంగం కలిగించదని స్పష్టంగా చెప్పుకున్నాయి. భారత్ మాత్రం ఎల్‌ఏసీపై "భిన్న అవగాహనలు" ఉన్నాయని తరచూ అంటోంది; ఇది చైనా అతిక్రమణలకు కొంత చట్టబద్ధత ఇచ్చి, సొంత స్థానాన్ని బలహీనపరుస్తుంది. 1996 ఒప్పందం పటాల మార్పిడి ద్వారా ఎల్‌ఏసీ మొత్తం అలైన్‌మెంట్‌పై "ఉమ్మడి అవగాహన"కు రావాలని కూడా నిర్దేశించింది. ఆగస్టు ఎనిమిది అంశాల ఏకాభిప్రాయంలోని "ఎల్‌ఏసీపై అవగాహనను మెరుగుపరచడం" అనే భావనను భారత్ లాంఛనప్రాయం చేయకపోవడం మంచిదని, ఎందుకంటే రెండు దశాబ్దాలుగా చైనా కోరుకుంటున్నది ఆ ఉమ్మడి అవగాహన కట్టుబాటు నుంచి తప్పించుకోవడమే. అస్పష్టత, ముక్కలుగా భూమిని కోసుకునే 'సలామీ స్లైసింగ్' వ్యూహంలో ఉన్న పక్షానికి లాభం.

ప్రతి అతిక్రమణనూ ప్రచారం చేయాలని దీని అర్థం కాదు. కానీ తీరు మారితే, చొరబాట్లు కొత్త ప్రాంతాలకు విస్తరిస్తే, లేదా చైనా భౌతిక ఉనికి పెరిగితే, పరిస్థితి చాలా తీవ్రమవుతుంది. గతంలో ప్రభుత్వం వాటిని బహిరంగపరిచింది: 1966లో చైనా బలగాలు ముందుకొచ్చినప్పుడు విషయం బయటపెట్టి పార్లమెంటులో చర్చించారు; 2020లో తూర్పు లద్దాఖ్‌లో అతిక్రమణలనూ అంగీకరించారు, అయితే ఆ తర్వాత పారదర్శకత కొరవడటం చూసిందే. తిరస్కరణలు, గందరగోళ సంకేతాల ధోరణి మరింత బహిరంగ సలామీ స్లైసింగ్‌ను ప్రోత్సహిస్తుంది. ఎలా స్పందించాలన్న ప్రశ్నకు అనుభవమే సమాధానం: 2014 సెప్టెంబర్‌లో షీ భారత్ పర్యటన తొలి రోజే ప్రధాని మోదీ చుమార్ అతిక్రమణను ఆయనతో ప్రస్తావించారు; యథాతథ స్థితి పునరుద్ధరణకు చైనా అంగీకరించడంలో అది కీలకం. తూర్పు లద్దాఖ్‌లో మాత్రం 2020 ఏప్రిల్ నాటి యథాతథ స్థితి ఆరేళ్ల తర్వాతా పూర్తిగా పునరుద్ధరణ కాలేదన్న విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. కాబట్టి చైనా పద్ధతిని, అంటే చిన్న చిన్న లాభాలను కలిపి తనకు అనుకూలమైన కొత్త పరిస్థితిని సృష్టించే ఆటను, భారత్ సాగనివ్వకూడదు. భారత వైపు ఎల్‌ఏసీ లోపల చైనా బలగాలు ఉంటే, లేదా భారత బలగాల క్రమమైన గస్తీని పీఎల్‌ఏ అడ్డుకుంటే, దాన్ని బహిరంగంగా అంగీకరించడమే మేలు. నిజాయితీ బీజింగ్‌తో వ్యవహరించే ఢిల్లీ చేతిని బలపరుస్తుంది, బలహీనం చేయదు. ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్న ఈ సందర్భంలో, ప్రభుత్వం పార్లమెంటుకు, ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. అరుణాచల్ ప్రజల మాటలను నిర్లక్ష్యం చేయకుండా, భయాందోళనలు సృష్టించకుండా, వాస్తవాలు చెప్పడమే సరైన మార్గం.

పనికొచ్చే పలుకు



గత అనుభవమే నిజమైన జ్ఞానం!

జీవితంలో ప్రతి ఒక్కరికీ ఎదగాలని, ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆశ ఉంటుంది. అయితే ప్రతి ప్రయాణం విజయాలతోనే సాగదు. కొన్నిసార్లు ఎదురుదెబ్బలు తగులుతాయి. నమ్మినవాళ్లు దూరమవుతారు. చేసిన ప్రయత్నాలు విఫలమవుతాయి. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడతాయి. మన సామర్థ్యంపై మనకే అనుమానం కలుగుతుంది. అలాంటి సమయంలో కొందరు నిరాశతో కుంగిపోతే, మరికొందరు ఆ కష్టాలనే తమ ఎదుగుదలకు పునాదులుగా మార్చుకుంటారు. నిజానికి కష్టకాలం మనకు ఎన్నో జీవిత పాఠాలు నేర్పిస్తుంది. మన బలహీనతలు ఏమిటి? ఎక్కడ తప్పు చేశాం? ఎవరిని అతిగా నమ్మాం? ఏ విషయంలో క్రమశిక్షణ కోల్పోయాం? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతికినప్పుడే మనలో మార్పు మొదలవుతుంది. అందుకే జీవితం మళ్లీ ఎదిగే అవకాశం ఇచ్చినప్పుడు గతాన్ని పూర్తిగా మర్చిపోకూడదు. కష్టకాలం నేర్పిన పాఠాలను గుర్తుంచుకోవాలి.

ఒక వ్యక్తి వ్యాపారంలో భారీగా నష్టపోయాడనుకుందాం. ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. ఆ సమయంలో అనవసర ఖర్చులు తగ్గించుకోవడం, ప్రతి రూపాయి విలువ తెలుసుకోవడం, సరైన వ్యక్తులను ఎంచుకోవడం నేర్చుకున్నాడు. కొంతకాలానికి మళ్లీ వ్యాపారాన్ని ప్రారంభించే అవకాశం వచ్చింది. ఇప్పుడు గత అనుభవాలను మర్చిపోయి పాత తప్పులే చేస్తే మళ్లీ నష్టపోవాల్సి వస్తుంది. అదే అనుభవాలను పాఠాలుగా స్వీకరించి ఆచితూచి అడుగులు వేస్తే విజయానికి బాటలు పడతాయి. ఈ సూత్రం వ్యాపారానికే కాదు.. ఉద్యోగం, కుటుంబం, స్నేహాలు, వ్యక్తిగత సంబంధాలు ఇలా ప్రతి విషయంలోనూ వర్తిస్తుంది. అయితే ఒకసారి విజయం సాధించగానే కొందరిలో అహంకారం పెరుగుతుంది. తమకంటే తెలివైనవారు ఎవరూ లేరన్న భావనతో ఇతరుల సలహాలను పట్టించుకోరు. ఇది మరో పతనానికి ఆరంభం కావచ్చు. అందుకే ఎదిగిన కొద్దీ వినయం పెరగాలి. వినయం అంటే మనల్ని మనం తక్కువ చేసుకోవడం కాదు.. ఇంకా నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని అంగీకరించడం. మన విజయం ఇతరులను కించపరిచేందుకు కాదు, మన వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడాలి.

మళ్లీ ఎదిగే అవకాశం వచ్చినప్పుడు లక్ష్యంపై పూర్తి దృష్టి పెట్టాలి. గతంలో ఎదురైన అవమానాలకు సమాధానం చెప్పాలనే ఆవేశంతో కాకుండా, భవిష్యత్తులో సాధించాల్సిన విజయాల కోసం పనిచేయాలి. ఇతరులతో పోల్చుకోవడం, పక్కవారి ఎదుగుదలను చూసి అసూయపడటం, అనవసరమైన విషయాలతో సమయాన్ని వృథా చేయడం మానుకోవాలి. ప్రతిరోజూ కొంత సమయాన్ని మన లక్ష్యాల కోసం కేటాయించాలి. సమయపాలన, ఆరోగ్యం, ఆర్థిక క్రమశిక్షణ, నిరంతర అభ్యాసం మన జీవనశైలిలో భాగం కావాలి. ఫలితం వెంటనే రాలేదని నిరుత్సాహపడకూడదు. ఎందుకంటే చిన్న చిన్న ప్రయత్నాలే కొంతకాలానికి పెద్ద విజయాలుగా మారతాయి. గుర్తుంచుకోండి.. కష్టకాలం నేర్పిన పాఠాలు మనకు రక్షణ కవచాలు. వినయం మన వ్యక్తిత్వానికి అందం. క్రమశిక్షణ విజయానికి పునాది. జీవితం మరో అవకాశం ఇచ్చినప్పుడు గతంలో కోల్పోయిన వాటిని తలుచుకుంటూ ఆగిపోకండి. ఈసారి మరింత పరిణతితో, పట్టుదలతో ముందడుగు వేయండి. రెండో అవకాశం రావడం అదృష్టం కావచ్చు.. కానీ దాన్ని విజయంగా మార్చుకోవడం మాత్రం మన చేతుల్లోనే ఉంటుంది!

'దూకుడు'కు ప్రజాతీర్పుతో బ్రేక్!


అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఎదురుదెబ్బ.. కాంగ్రెస్‌పై డెమోక్రాట్ల పట్టు.. ట్రంప్ విధానాలపై ప్రజాగ్రహానికి ప్రతిబింబం.. 2020 నాటి వైఖరికి భిన్నంగా ఓటమిని అంగీకరించిన అధ్యక్షుడు.. అయినా రాజకీయ బాధ్యత స్వీకరించేందుకు నిరాకరణ.. అమెరికా ప్రజాస్వామ్యానికి ఈ ఎన్నికలు ఇస్తున్న సందేశమేమిటి?



అమెరికా రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి 2026 మధ్యంతర ఎన్నికలు గట్టి ఎదురుదెబ్బను మిగిల్చాయి. అధికారంలో ఉన్న అధ్యక్షుడి పాలనకు ప్రజామోదం ఏ స్థాయిలో ఉందో పరీక్షించే ఈ ఎన్నికల్లో ఓటర్లు ట్రంప్ విధానాలపై తమ అసంతృప్తిని స్పష్టంగా వ్యక్తం చేశారు. ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ డెమోక్రాట్లు ఆధిపత్యం సాధించడంతో అమెరికా కాంగ్రెస్‌పై వారి పట్టు బిగిసింది. సంప్రదాయంగా రిపబ్లికన్లకు బలమైన ప్రాంతాల్లోనూ డెమోక్రాట్లు విజయాలు సాధించడం ఈ ఫలితాల్లో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా అధ్యక్ష ఎన్నికలకు రెండేళ్ల తర్వాత జరిగే మధ్యంతర ఎన్నికలను అధికారంలో ఉన్న ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణగా పరిగణిస్తారు. అధ్యక్షుడి విధానాలు, ఆర్థిక పరిస్థితులు, ప్రజా సంక్షేమం, విదేశాంగ వ్యవహారాలపై ఓటర్లు తమ అభిప్రాయాన్ని బ్యాలెట్ ద్వారా వెల్లడిస్తారు. ఈసారి ట్రంప్ స్వయంగా ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొని, తన పాలనకు ప్రజామోదం కోరారు. అయితే ఫలితాలు మాత్రం ఆయనకు అనుకూలంగా రాలేదు. ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరలు, ఇంధన వ్యయాలు, వాణిజ్య సుంకాలు, ఇరాన్‌తో యుద్ధ పరిణామాలు ప్రజలపై ప్రభావం చూపినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపై అమెరికా ఆధిపత్యాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చిన ట్రంప్‌కు దేశీయ ఆర్థిక పరిస్థితులే రాజకీయ బలహీనతగా మారాయి. ప్రజలకు కావాల్సింది కేవలం జాతీయవాద నినాదాలు, విదేశాంగ దూకుడు మాత్రమే కాదని, తమ కుటుంబాల ఆర్థిక భద్రత, ఉపాధి అవకాశాలు, కొనుగోలు శక్తి, భవిష్యత్తుపై భరోసా కూడా ముఖ్యమని ఈ తీర్పు చాటిచెప్పింది. ప్రజల రోజువారీ జీవితాలను ప్రభావితం చేసే అంశాలను విస్మరిస్తే ఎంతటి ప్రజాకర్షణ కలిగిన నాయకుడైనా ఓటమి నుంచి తప్పించుకోలేడని ఎన్నికలు మరోసారి నిరూపించాయి.

ఈ ఎన్నికల ఫలితాల కంటే వాటిపై ట్రంప్ స్పందించిన తీరు అంతర్జాతీయంగా మరింత చర్చకు దారితీసింది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ చేతిలో ఓటమిని అంగీకరించకుండా ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేయడం, న్యాయస్థానాల్లో సవాళ్లు విసరడం, చివరకు 2021 జనవరి 6న క్యాపిటల్ భవనంపై ఆయన మద్దతుదారులు దాడికి దిగడం అమెరికా ప్రజాస్వామ్య చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయాయి. ఎన్నికల ఫలితాలను ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతపైనే సందేహాలు రేకెత్తించిన ట్రంప్, ఇప్పుడు తన పార్టీ పరాజయాన్ని అంగీకరించడం గమనార్హం. డెమోక్రాట్ల విజయాన్ని గుర్తిస్తూ వారితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించడం కొంత సానుకూల పరిణామమే. అయితే ఈ అంగీకారంలోనూ ఆయన రాజకీయ చతురత కనిపిస్తోంది. ఓటమికి తన పాలనలోని లోపాలు కారణం కాదని, తాను నేరుగా ఎన్నికల బరిలో లేకపోవడమే ఫలితాలపై ప్రభావం చూపిందని వ్యాఖ్యానించడం ద్వారా రాజకీయ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఇరాన్‌తో యుద్ధం కూడా రిపబ్లికన్ల ఓటమికి ఒక కారణమై ఉండవచ్చని అంగీకరించినప్పటికీ, తన నిర్ణయాలను సమర్థించుకోవడం మానలేదు. డెమోక్రాట్లు ప్రతిపాదించే చట్టాలు తనకు ఆమోదయోగ్యంగా లేకపోతే వీటో అధికారాన్ని ఉపయోగిస్తానని హెచ్చరించారు. అంటే ఎన్నికల ఫలితాలను అంగీకరించడం ఒక ఎత్తయితే, వాటి ఆధారంగా రాజకీయ వైఖరిలో మార్పు తీసుకురావడం మరో ఎత్తు. ప్రజాస్వామ్యంలో ఓటమిని అంగీకరించడం బలహీనత కాదు. ప్రజల తీర్పును గౌరవించడం ప్రతి నాయకుడి కనీస బాధ్యత. 2020 నాటి పరిణామాలతో పోలిస్తే తాజా స్పందన అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థపై కొంత విశ్వాసాన్ని పునరుద్ధరించే అంశమే. అయితే ఓటమిని అంగీకరించడంతోనే బాధ్యత పూర్తికాదు. ప్రజలు ఎందుకు వ్యతిరేకించారో గుర్తించి, విధానాల్లో అవసరమైన మార్పులు చేసుకోవడమే నాయకత్వానికి పరీక్ష. ట్రంప్ ఆ పరీక్షను ఎలా ఎదుర్కొంటారన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

మరోవైపు డెమోక్రాట్ల విజయంతో అమెరికా అధికార వ్యవస్థలో కీలకమైన సమతుల్యత మారనుంది. కాంగ్రెస్‌లో రెండు సభలపైనా వారి ఆధిపత్యం ఏర్పడటంతో ట్రంప్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై పర్యవేక్షణ పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ బిల్లులను అడ్డుకోవడం, కీలక నియామకాలపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం, పాలనా నిర్ణయాలపై విచారణలు చేపట్టడం వంటి అవకాశాలు డెమోక్రాట్లకు లభిస్తాయి. దీంతో రాబోయే రెండేళ్లు అమెరికాలో అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య రాజకీయ ఘర్షణలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే దీనివల్ల ట్రంప్ పాలన పూర్తిగా స్తంభించిపోతుందని భావించడం సరికాదు. అమెరికా రాజ్యాంగం అధ్యక్షుడికి కొన్ని స్వతంత్ర అధికారాలను కల్పించింది. విదేశాంగ విధానం, వాణిజ్య సుంకాలు, కార్యనిర్వాహక నిర్ణయాల విషయంలో ఆయనకు ఇంకా గణనీయమైన స్వేచ్ఛ ఉంటుంది. ఈ పరిణామాలు అంతర్జాతీయ రాజకీయాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపవచ్చు. భారత్‌కు కూడా అమెరికాతో వాణిజ్య సంబంధాలు, రక్షణ సహకారం, సాంకేతిక భాగస్వామ్యం, వీసా విధానాల విషయంలో ఈ రాజకీయ మార్పులు కీలకం కానున్నాయి. ట్రంప్ అనుసరిస్తున్న రక్షణాత్మక వాణిజ్య విధానాలపై కాంగ్రెస్‌లో ఒత్తిడి పెరిగితే భారత్‌కు కొన్ని కొత్త అవకాశాలు ఏర్పడవచ్చు. అయితే అమెరికా జాతీయ ప్రయోజనాల విషయంలో పార్టీల మధ్య కొనసాగింపు ఉంటుందన్న వాస్తవాన్ని విస్మరించరాదు. డెమోక్రాట్ల ముందున్న సవాలు కూడా చిన్నదేమీ కాదు. ట్రంప్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తమ విజయంగా మలుచుకోవడం ఒక ఎత్తయితే, మెరుగైన పాలన అందించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మరో ఎత్తు. ప్రతీకార రాజకీయాలకు ప్రాధాన్యమివ్వకుండా ప్రజల ఆర్థిక సమస్యలు, ఉపాధి, సామాజిక భద్రతపై దృష్టి సారించాల్సిన బాధ్యత వారిపై ఉంది. అంతిమంగా ఈ ఎన్నికలు ప్రపంచానికి ఇచ్చిన సందేశం ఒక్కటే.. అధికారం ఎంత బలంగా కనిపించినా ప్రజల తీర్పు ముందు తలవంచక తప్పదు. ప్రజాస్వామ్యంలో నాయకులు శాశ్వతం కాదు.. ప్రజల విశ్వాసమే నిజమైన రాజకీయ బలం! ■



జ్ఞానం మనకు ఎన్నో విషయాలను పరిచయం చేస్తుంది. అనుభవం వాటిని ఎలా ఆచరించాలో నేర్పిస్తుంది. కానీ వివేకం మాత్రమే ఎప్పుడు, ఎక్కడ, ఎలా వ్యవహరించాలో తెలియజేస్తుంది. ఎక్కువ విషయాలు తెలిసినంత మాత్రాన ఎవరూ గొప్పవారు కాలేరు. తెలిసిన విషయాలను లోతుగా అర్థం చేసుకొని, పరిస్థితులను బట్టి సరైన నిర్ణయాలు తీసుకునేవారే నిజమైన విజేతలు. ఎందుకంటే జ్ఞానం మన ఆలోచనలకు పదును పెడితే.. అనుభవం వాటికి పరిపక్వతనిస్తుంది. వివేకం మాత్రం మన వ్యక్తిత్వానికి విలువను తెస్తుంది. తెలుసుకోవడం గొప్ప కాదు.. తెలిసిన దాన్ని సరిగ్గా ఉపయోగించుకోవడమే అసలైన గొప్పతనం!

-మహాదేవ

వింతల్లో వింతలు

చిన్న రబ్బర్ బ్యాండ్.. భారీ ప్రపంచ రికార్డు!



సాధారణంగా రబ్బర్ బ్యాండ్‌తో ఏదైనా కట్టేస్తాం.. కానీ అమెరికాలోని డెట్రాయిట్‌కు చెందిన క్లాడ్ పి. మూర్ మాత్రం వాటితో ఏకంగా ప్రపంచ రికార్డునే చుట్టేశాడు! 2015లో మొదలుపెట్టిన ఈ ప్రయత్నం పదకొండేళ్లకు 11,578 పౌండ్ల (5,251 కిలోల) భారీ రబ్బర్ బ్యాండ్ బంతిగా రూపుదిద్దుకుంది. ఏనుగు బరువుతో సమానమైన ఈ బంతిని క్రేన్ సాయంతో తూకం వేయగా గిన్నిస్ రికార్డు దక్కింది. గతంలో ఉన్న రికార్డును కూడా బద్దలుకొట్టాడు. చిన్నప్పటి సరదా.. పట్టుదల ఉంటే ఎంత పెద్దదైనా అవుతుందని క్లాడ్ నిరూపించాడు. ఇక ఆయన ఇంట్లో రబ్బర్ బ్యాండ్ కనిపిస్తే మాత్రం ఎవరూ చిన్నచూపు చూడకూడదేమో!

భారతీయులతో పెట్టుకున్నాడు.. ట్రంప్ అనుభవిస్తున్నాడు..



నువ్వు ఎవరితోనైనా పెట్టుకో కానీ.. 'బాల్య మిత్రులు' ఉన్నోడితో మాత్రం పెట్టుకోకు అని అదేదో సినిమాలో 'వేణుమాధవ్' ఓ పాపులర్ డైలాగ్ వదులుతాడు. ఇప్పుడు ఈ డైలాగ్ మన ట్రంప్ తాతకు సరిగ్గా సూట్ అవుతుంది. ఎందుకంటే ఆయన పెట్టుకోకూడని వారితో పెట్టుకున్నాడు. ఇప్పుడు అనుభవిస్తున్నాడు. ఏకంగా 30 ఏళ్లుగా రిపబ్లికన్ల కంచుకోటల్లో కూడా ట్రంప్ పార్టీ ఓడిపోయి తగిన గుణపాఠాన్ని పొందింది. దీనంతటికి కారణం ట్రంప్ వెర్రితలలతో వేసిన అడుగులు.. అహంకారపు చేష్టలు.. మాటలు.. అందుకే ఇప్పుడు అనుభవించేస్తున్నాడు..

అమెరికా మిడ్ టర్మ్ ఎన్నికలు ట్రంప్ తాతకు కర్రుకాల్చి వాతపెట్టారు. ఈ ఫలితాలు రిపబ్లికన్ పార్టీకి ఒక కీలకమైన సందేశాన్ని పంపాయి. ముఖ్యంగా భారతీయులపై అమెరికాలో పెరుగుతున్న వ్యతిరేకత.. హెచ్1బీ వీసాల విషయంలో కొందరు మాగా మద్దతుదారులు చేస్తున్న విద్వేషపూరిత వ్యాఖ్యలు, చేష్టలు ట్రంప్ పార్టీకి రాజకీయంగా తీవ్ర నష్టం కలిగించాయని ఈ ఎన్నికలతో నిరూపితమైంది.'హౌడీ మోడీ' అంటూ గత సారి ట్రంప్ కు మద్దతుగా ఏకంగా భారత ప్రధాని ప్రచారం చేసి ఆయనకు బాసటగా నిలిచారు. అప్పుడు భారతీయ అమెరికన్లు అంతా ట్రంప్ వెంట నడిచి గెలిపించారు. కానీ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక పూర్తిగా మారిపోయాడు. అసలు పాత ట్రంప్ కు కొత్త ట్రంప్ కు తేడానే లేదు. మన శత్రుదేశం పాకిస్తాన్ తో కలవడం.. భారత్ పై 100 శాతం టారిఫ్ లు.. అమెరికాలోని భారతీయులపై వీసా సమస్యలు, హెచ్1బీ ఆంక్షలు సహా ఎన్నారైలను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించాడు. భారతీయులపై ట్రంప్ రెండో సారి అధికారంలోకి వచ్చాక వివక్ష, జాత్యహంకార వ్యాఖ్యలు, భారత్ పై వ్యతిరేక ధోరణి విపరీతంగా పెరిగాయి. అవే ఇప్పుడు ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీని చావు దెబ్బ తీశాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

అమెరికాను భారతీయులు ఎప్పుడూ దోచుకోలేదు. మన టాలెంట్ తో అమెరికాను అగ్రరాజ్యంగా నిలబెట్టారు. మనవాళ్లు బాగుపడ్డారు. అయితే భారతీయ నిపుణుల విషయంలో ట్రంప్ సర్కార్ వ్యవహరించిన తీరుతో మొత్తం ఇండియన్ సమాజం ఈసారి రిపబ్లికన్ పార్టీకి దూరమైంది. పూర్తిగా డెమొక్రాట్ల వైపు తిరిగినట్టు ఎన్నికల ఫలితాలను బట్టి అర్థమైంది.ఇక అమెరికాలో భారతీయులు కేవలం ఉద్యోగులు మాత్రమే కాదు.. వ్యాపారులుగా, వైద్యులు, ఐటీ అగ్రస్థానంలోని సీఈవోలు, విద్యావేత్తలు, పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులుగా కూడా ఎదిగారు. ఇలాంటి పరిస్థితుల్లో వీరంతా ఈసారి మూకుమ్మడిగా డెమొక్రాట్ల వైపు మరలడంతో రిపబ్లికన్ పార్టీకి మరణశాసనం లిఖించినట్టైంది.

అమెరికా ఎన్నికలు సందేశం ఒక్కటే.. భారతీయులతో పెట్టుకొని ఇప్పుడు ట్రంప్, ఆయన పార్టీ అనుభవిస్తోంది. మనవాళ్ల ఇన్ఫ్లూయేన్స్, ప్రభావం.. అమెరికన్ ఓటర్లలో కూడా ట్రంప్ తీరుపై వ్యతిరేకత ప్రస్ఫుటంగా కనిపించింది. భారతీయుల కృషిని తక్కువ అంచనావేసి.. వారిపై వివక్ష చూపి అమెరికన్ల ఓట్లు కొల్లగొడుదామనుకున్న ట్రంప్ ఇప్పుడు మూల్యంచెల్లించుకున్నాడు. భారతీయులపై వ్యతిరేత చూపిస్తే వారి ఓట్లే కాదు.. అమెరికన్ల ఓట్లు కూడా దూరం అయ్యాయన్న గుణపాఠం ట్రంప్ కు ఇప్పటికైనా జ్ఞానోదయం కలిగిస్తుందో లేదో చూడాలి.

కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్.. తొలి వన్డేలో కివీస్‌పై భారత్ ఘనవిజయం

కివీస్‌తో తొలి వన్డేలో 5 వికెట్ల తేడాతో భారత్ గెలుపు

వర్షం కారణంగా లక్ష్యాన్ని 143 పరుగులకు కుదింపు

విరాట్ కోహ్లీ అద్భుతమైన 74 పరుగుల ఇన్నింగ్స్

భారత పేసర్లు అర్ష్‌దీప్, గుర్నూర్, కంబోజ్ అద్భుత ప్రదర్శన

185 పరుగులకే కుప్పకూలిన న్యూజిలాండ్ జట్టు



ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం పదేపదే అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (74) క్లాస్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.అంతకుముందు టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. భారత యువ పేస్ త్రయం అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కంబోజ్ అద్భుతంగా రాణించారు. మేఘావృతమైన వాతావరణాన్ని సద్వినియోగం చేసుకుంటూ కివీస్ బ్యాటర్లను ఆరంభం నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. అర్ష్‌దీప్ సింగ్ 4 వికెట్లతో చెలరేగగా, గుర్నూర్ 3, అన్షుల్ 2 వికెట్లు పడగొట్టారు. వీరి దెబ్బకు న్యూజిలాండ్ జట్టు 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. కివీస్ జట్టులో ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ (38), గ్లెన్ ఫిలిప్స్ (30) కాసేపు నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. అయితే చివర్లో బ్లెయిర్ టిక్నర్ కేవలం 23 బంతుల్లో 4 సిక్సర్లతో 34 పరుగులు చేసి అనూహ్యంగా మెరిశాడు. అయినప్పటికీ కివీస్ జట్టు 200 పరుగుల మార్కును కూడా దాటలేకపోయింది.లక్ష్య ఛేదనలో టీమిండియా ఆరంభంలోనే ఒక వికెట్ కోల్పోయినా, విరాట్ కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లో తన 80వ అర్ధశతకాన్ని నమోదు చేసిన కోహ్లీ, మరో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (37)తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. భారత ఛేదన సమయంలో వర్షం రెండుసార్లు అంతరాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి (డీఎల్ఎస్) ప్రకారం లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా సవరించారు. ఈ భాగస్వామ్యంతో భారత్ విజయం దాదాపు ఖాయమైంది. అయితే, లక్ష్యానికి చేరువవుతున్న సమయంలో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కాస్త తడబడింది. అయినప్పటికీ, చివరకు 22.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసి సునాయాసంగా విజయాన్ని అందుకుంది.

వయసు పెరిగినా తగ్గని జోరు.. "ఇంకా 21 ఏళ్ల అమ్మాయినే అనుకుంటా" అంటున్న సింధు




వరుసగా రెండు టోర్నీల్లో ఫైనల్ చేరి మళ్లీ పూర్వపు ఫామ్ అందుకున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు.. ఇప్పుడు తన శారీరక దృఢత్వంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. డిసెంబరులో జరిగే బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు పూర్తి ఫిట్‌నెస్‌తో సిద్ధమయ్యేందుకు కొరియా ఓపెన్ సహా తదుపరి టోర్నీలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించింది. "నాకిప్పుడు చిన్న వయసు కాదు. 31 ఏళ్లు. అయినా ఇంకా 21 ఏళ్ల అమ్మాయినే అనుకుంటా" అంటూ తన ఉత్సాహాన్ని చాటుకుంది.ఇటీవల జర్మనీలో జరిగిన హైలో ఓపెన్‌లో సింధు మహిళల సింగిల్స్ టైటిల్ గెలుచుకుంది. ఈ ఏడాది ఆమె ఖాతాలో చేరిన రెండో బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ ఇది. అంతకుముందు జులైలో జపాన్ ఓపెన్ సూపర్ 750లో విజేతగా నిలిచింది. 2024 డిసెంబరు తర్వాత ఆమె గెలిచిన తొలి వ్యక్తిగత టైటిల్ కూడా అదే. మొత్తంగా సింధు ఇప్పటివరకు ఏడు వరల్డ్ టూర్ టైటిళ్లు సాధించింది. ఈ సీజన్‌లో పారిస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ ఫైనల్ చేరిన ఆమె.. ప్రపంచ నంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్ ఛాంపియన్ అన్ సెయంగ్ చేతిలో ఓడింది.సుదీర్ఘ పర్యటన తర్వాత శరీరానికి విశ్రాంతి అవసరమని భావించి కొరియా ఓపెన్, జపాన్ మాస్టర్స్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు సింధు తెలిపింది. తొలుత అన్ని టోర్నీలు ఆడాలనుకున్నా, చివరకు శరీరం మాట వినాలని భావించినట్లు చెప్పింది. వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు ముందు విశ్రాంతి తీసుకొని మరింత బలంగా కోర్టులోకి రావడమే తన లక్ష్యమని పేర్కొంది.2027 జనవరి 4 నుంచి అమల్లోకి రానున్న 3ఐ15 పాయింట్ల స్కోరింగ్ విధానంపైనా సింధు స్పందించింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న 21 పాయింట్ల విధానంతో పోలిస్తే కొత్త పద్ధతిలో ఆటగాళ్లు ఆరంభం నుంచే అప్రమత్తంగా ఉండాలని చెప్పింది. తొలి ఐదు, ఆరు పాయింట్లు కోల్పోతే ఆటలో సగం సమయం ముగిసినట్లేనని వివరించింది. ప్రత్యర్థికి సులభంగా పాయింట్లు ఇచ్చే అవకాశం ఉండదని, ప్రతి క్షణం చురుగ్గా ఆడాల్సి ఉంటుందని అభిప్రాయపడింది.

రెబల్ లుక్ లో హుమా ఖురేషి.. కుర్రాళ్లు ఏమైపోవాలి?

బార్బీ తరహా గులాబీ రంగు దుస్తుల్లో మెరిసిపోతున్న గేహ్నా సిప్పీ







ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు ఒకవైపు సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే.. మరొకవైపు గ్లామర్ తో కట్టిపడేస్తున్న విషయం తెలిసిందే. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ రోజుకో ఫోటోషూట్ తో అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు.ఇలా ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న ఎంతో మంది సెలబ్రిటీలు ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీలపై కూడా దర్శనం ఇస్తూ మరింత క్రేజ్ దక్కించుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రముఖ బాలీవుడ్ బ్యూటీగా మంచి పేరు సొంతం చేసుకున్న హుమా ఖురేషి తాజాగా తన అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. జీక్యూ ఇండియా హీరోస్ మ్యాగజైన్ కోసం ఇచ్చిన ఫోజులలో ఈమె రెబల్ లుక్ చూసి కుర్రాళ్ళు సైతం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ ఫీబీ ఫిలో రూపొందించిన ఓవర్ సైజ్డ్ బ్లాక్ లెదర్ జాకెట్ ధరించిన ఈమె దీనికి కాంబినేషన్లో వార్డుబోర్డు ఎన్. వై.సీ.బ్రాండ్ కు చెందిన సింపుల్ అండ్ స్లీక్ లెగ్గింగ్ ధరించింది. ఈ అవుట్ ఫిట్ కి తగ్గట్టుగా అవుట్ హౌస్ జువెలరీ కలెక్షన్ నుండి వచ్చిన ఇండస్ట్రియల్ స్టైల్ మెటల్ లింక్ లాంగ్ నెక్లెస్ ధరించి తన మేకోవర్ను ఫుల్ ఫీల్ చేసుకుంది.ముఖ్యంగా జీ క్యు ఇండియా హీరోస్ ఫోటోలకు సంబంధించిన ఈ బోల్డ్ అండ్ స్టైలిష్ లుక్ సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. మొత్తానికైతే హుమా లుక్ చూసిన నెటిజన్స్ ఈ రేంజ్ లో అందాలు ఆరబోస్తే కుర్రాళ్ళు ఏమైపోవాలి అంటూ సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా అమ్మడి అందం సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది.ప్రముఖ బాలీవుడ్ నటిగా పేరు దక్కించుకున్న ఈమె ఇండస్ట్రీలోకి రాకముందు మోడల్ గా తన కెరీర్ మొదలుపెట్టింది. 2012లో 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' అనే చిత్రం ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె.. హిందీతో పాటు తమిళ్,మరాఠీ, కన్నడ సినిమాలలో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే చివరిగా కన్నడ సినీ నటుడు యశ్ హీరోగా మలయాళ డైరెక్టర్ గీతూ మోహన్దాస్ దర్శకత్వంలో వచ్చిన కన్నడ - ఇంగ్లీషు ద్విభాష చిత్రమైన టాక్సిక్ లో ఎలిజిబెత్ అనే విలన్ పాత్ర పోషించింది. ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేదు.ఇందులో హుమా ఖురేషి తో పాటు నయనతార , కియారా అద్వానీ, రుక్మిణి వసంత్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. 1940 నాటి గోవా నేపథ్యంలో సాగే భారీ బడ్జెట్ గ్యాంగ్టర్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఆడియన్స్ ను ఆకట్టుకోవడంలో విఫలమయ్యింది. దీనికి తోడు హిందీలో పూజ మేరీ జాన్ అనే చిత్రంలో కూడా నటించింది. ఏది ఏమైనా ఒకవైపు వరుస సినిమాలలో నటిస్తూ.. మరొకవైపు ఇలా గ్లామర్ అందాలు ఆరబోస్తూ అభిమానులకు మరింత చేరువ అవుతోంది.

అద్భుతమైన ఎరుపు రంగు ఫ్యాషన్ లుక్‌తో ఆకర్షిస్తున్న అతుల్య రవి

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965